


# విజయభాను

46 Years of Excellence
విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు

విశాఖపట్నం, మంగళవారం 11-07-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 238 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## చంద్రయాన్ 3 ప్రయోగానికి మోదీ..?

### ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్



న్యూఢిల్లీ : జాబిల్లిపై అన్వేషణలో భాగంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్-3 ప్రయోగానికి రంగం సిద్ధమైంది. జులై 14న మధ్యాహ్నం 2.35 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఎల్‌వీఎం-3పీ4 రాకెట్ చంద్రయాన్-3ని మోసుకుని నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. చంద్రయాన్-3 ప్రయోగంపై ఇస్రో అధినేత ఎస్. సోమ్‌నాథ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు పలువురు ప్రముఖులకు ఆహ్వానాలు అందించినట్లు తెలిపారు. అయితే, ప్రధాని మోదీ ఈ ప్రయోగానికి హాజరవుతారా అని ప్రశ్నించగా.. "మేం అందర్నీ ఆహ్వానిస్తున్నాం. ప్రధాని వస్తారని ఆశిస్తున్నాం."అని తెలిపారు.

కాగా.. 2019లో జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్ లక్ష్యంగా ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ 2 ల్యాండింగ్ అప్రోచ్‌ను ప్రధాని మోదీ వీక్షించారు. అయితే సాంకేతిక కారణాలతో ఆ ప్రయోగం విఫలమైన విషయం తెలిసిందే. ల్యాండర్ వేగాన్ని నియంత్రించలేకపోవడంతో అది లూనార్ ఉపరితలాన్ని గట్టిగా ఢీకొట్టింది. దీంతో ల్యాండర్‌లోని భాగాలు దెబ్బతిని భూకేంద్రంతో సంబంధాలు తరువాయి 2లో..





సీఎం జగన్ కడప జిల్లా కొప్పర్తి పర్యటనలో భాగంగా పారిశ్రామికవాడ పరిశీలన, అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించారు. వైఎస్సార్ ఈఎంసీ క్లస్టర్‌లో ఆల్ డిక్సన్ యూనిట్‌తోపాటు పలు పారిశ్రామిక యూనిట్లను సీఎం జగన్ ప్రారంభించారు. ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ యూనిట్‌లో సర్వైలెన్స్ కెమెరాలు, డిజిటల్ రికార్డర్, లాప్‌టాప్ తయారీ కేంద్రాలను పరిశీలించారు. సీఎం వెంట సీఎస్ జవహర్ రెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ అవినాష్ రెడ్డి ఉన్నారు. ఆల్ డిక్సన్ సి.పి ప్లస్ యూనిట్ లో 2 నుంచి 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. చైనా తర్వాత ప్రపంచ వ్యాప్తంగా మూడవ అతిపెద్ద యూనిట్ కొప్పర్తిలో ఏర్పాటు కానుంది.

## రాష్ట్రపతితో నిర్మల సీతారామన్ భేటీ..



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో భారీగా మార్పులు జరగబోతున్నాయనే ఊహాగానాల నడుమ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ను రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. ఈ వారంలోనే మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించ బోతున్నట్లు వార్తలు వస్తున్న తరుణంలో వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లే ముందే మంత్రివర్గంలో మార్పులు చేయబోతున్నట్లు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇటీవల కొందరు మంత్రులతో సమావేశాలు జరిపిన సంగతి తెలిసిందే. నడ్డాతో నిర్మల కూడా సమావేశమయ్యారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నెల 20 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ కూడా సమాయత్తమవుతోంది. పాత మిత్రులను దగ్గరకు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్డీయే నుంచి విడిపోయిన పార్టీలను కూడా ఆకర్షించాలని ప్రయత్నిస్తోంది. ఈ నెల 18న ఎన్డీయే సమావేశానికి హాజరుకావాలని వివిధ పార్టీలను ఆహ్వానించింది. ఎస్ఏడీ, టీడీపీ, జేడీఎస్ తరువాయి 2లో..

## వాలంటీర్లపై పవన్ మాట్లాడిన తీరు బాధాకరం

### మంత్రి గుడివాడ అమర్నాథ్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : నిత్యం ప్రభుత్వాన్ని నిందించడమే పవన్ కల్యాణ్ పనా అని మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. రాజకీయ పార్టీ నాయకునిగా అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తానో చెప్పాలి కానీ ప్రతిసారీ సీఎంను విమర్శించడమే పనిగా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. పవన్ తీరు మార్చుకోకుంటే ప్రజలే చెప్పులు చూపిస్తారని విమర్శించారు. పవన్ కల్యాణ్ కాకి లెక్కలను ప్రజలను విశ్వసించరని అన్నారు. ఎన్సీపీ, ఎన్సీఆర్‌బీకి తేడా తెలియని వ్యక్తి పవన్ అని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ సైకోలా మాట్లాడుతున్నాడని, ఆయన హావభావాలు ఉన్మాదిలా ఉన్నాయని ధ్వజమెత్తారు.

'వాలంటీర్లపై పవన్ మాట్లాడిన తీరు బాధాకరం. వాలంటీర్లలో 60 శాతం మహిళలు ఉన్నారు. వాలంటీర్లపై నిందలు వేయడానికి పవన్‌కు బుద్ధి ఉందా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేశారు. వాలంటీర్లు పవన్ క్షమాప ణలు చెప్పాలి. పదేళ్లైనా పవన్ రాజకీయాల్లో ఎదగలేదు. అవసరాలకు తల్లి, రాజకీయాల కోసం భార్య పేరు ఉపయోగి స్తున్నారు. పవన్ తల్లిని అవమానిం చింది టీడీపీ నేతలే కదా. వారిని కాకుండా మమ్మల్ని విమర్శించడం దేనికి?. వైఎస్సార్ సీపీ నాయకులు ఎప్పుడైనా మీ తల్లి, భార్య గురించి మాట్లాడారా? కమెడి యన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా ఎమ్మెల్యేలు అయ్యారు. పవన్ ఎందుకు ఎమ్మెల్యే అవ్వలేదు. జనసేన పార్టీ ఎందుకు. డబ్బులు తీసుకొని ఖర్చు చేయడం ఎందుకు. టీడీపీలో విలీనం చేసేయొచ్చు కదా? విలీనం చేస్తే విడతలుగా డబ్బు రాదని ఆలోచిస్తున్నావా ? 'వారాహి పార్ట్ 2లో భాగంగా పొలిటికల్ సైడ్ హీరో రాజకీయాలు మాట్లాడారు. సంసారం గురించి ఓ తిరుగుబోతు మాట్లాడినట్లు పవన్ మాట్లా డారు. పవన్‌ను చూసి అమ్మాయిలు భయప డుతున్నారు. మీకు ధైర్యం వుంటే అమ్మ ఒడి, వాలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తున్నట్టు చెప్పగలవా' అని ప్రశ్నించారు.

## యువత, మేధావులు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలి



ఢిల్లీ : రాజకీయాలపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో జరుగుతున్న 23వ తానా మహాసభల్లో జస్టిస్ రమణ ప్రసంగించారు. రాజకీయాల్లో వికృత ఘటనలు చూస్తున్నామని, పార్టీల నిర్వహణను ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలతో సంబంధం లేనివారు పార్టీలెలా నడుపుతారని జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించారు. రాజకీయాల్లో ప్రమాణాలు పూర్తిగా పడిపోతున్నాయని అన్నారు. సోషల్ మీడియాలో స్త్రీలను అసభ్యంగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "దుష్ప్రచారమే ఎన్నికల వ్యూహంగా మారింది. మేనిఫెస్టో గురించి మాట్లాడే అవకాశమే లేకుండా పోయింది. సామాజిక మాధ్యమాల ద్వారా పక్కదోవ పట్టిస్తున్నారు. ప్రలోభ అంశాలకు ప్రాధాన్యత పెంచి ఓట్లు దండుకుంటున్నారు" అని జస్టిస్ రమణ విమర్శలు చేశారు. యువత, మేధావులు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేవరకు తెలుగువారు విశ్రమించకూడదని పిలుపునిచ్చారు.

## జగనన్నకు చెబుదాం అర్జీలను కాలపరిమితిలోగా పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిటీషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 289 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్ , డిఆర్ఓ శ్రీనివాస మూర్తి, పోలీస్ అధికారులు , మున్సిపల్ అధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు .

## పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు

అమరావతి, **(విజయభాను న్యూస్)** : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఏపీలో మహిళలు కనిపించకుండా పోతున్నారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ స్పందించింది. పది రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఏ కేంద్ర నిఘా వ్యవస్థ చెప్పిందో సమాచారం ఇవ్వాలని కోరింది. పవన్ చెబుతున్నట్లుగా తప్పిపోయిన మహిళల వివరాలు ఇవ్వాలని మహిళా కమిషన్ డిమాండ్ చేసింది.

వివరాలు తెలిపిన కేంద్ర అధికారి ఎవరో చెప్పాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశించింది. ఏలూరు నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల అదృశ్యాలకు వాలంటీర్లే కారణమని, వైకాపా పాలనలో అదృశ్యమైన 30 వేల మందిలో 14 వేల మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

" వైకాపా పాలనలో ప్రతి గ్రామంలో వాలంటీర్లను పెట్టి కుటుంబంలో ఎంత మంది ఉన్నారు? వారిలో మహిళలు ఎందరు? వితంతువులున్నారా? అని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఒంటరి మహిళలే లక్ష్యంగా సమాచారం సేకరించి సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారు" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.



# “డయల్ యువర్ మేయర్” కు 11, “జగనన్న కు చెబుదాం” కు 116 వినతులు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** “డయల్ యువర్ మేయర్” కు 11, జగనన్నకు చెబుదాం(స్పందన)కు 116 ఆర్జీలు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో “డయల్ యువర్ మేయర్”, “స్పందన” కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఆ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ “డయల్ యువర్ మేయర్” కార్యక్రమంలో 11 ఆర్జీలు వచ్చాయని, వాటిలో విభాగాల వారీగా ఇంజినీరింగ్ కు 05, టౌన్ ప్లానింగ్ కు 02, ప్రజా ఆరోగ్యపు విభాగానికి 02 యుసిడి కు 02 వచ్చాయన్నారు. అలాగే “జగనన్న కు చెబుదాం” లో మొత్తం116 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో ఒకటవ జోన్ కు 03, రెండవ జోన్ కు 17, మూడువ జోన్ కు 21, నాల్గవ జోన్ కు 16, ఐదవ జోన్ కు 12, ఆరవ జోనుకు 24, ఏడవ జోన్ కు 01, ఎనిమిదివ జోన్ కు 12, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 10 ఫిర్యాదులు, మొత్తము 116 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన %ఒ% అక్కౌంట్స్ కు 02, రెవెన్యూ కు 09, ప్రజా ఆరోగ్యపు విభాగానికి 11, టౌన్ ప్లానింగ్ కు 44, ఇంజినీరింగ్ కు 37, యుసిడి కు 13 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఆ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులను ఆదేశించారు. దీనిపై కమీషనర్ స్పందిస్తూ ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న “జగనన్న కు చెబుదాం” కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో..., తరువాత వారం వచ్చే “జగనన్న కు చెబుదాం” కార్యక్రమానికి ముందుగా సమర్పించవలసిన వివరాలుతో ఆయా విభాగాధిపతులు సిద్ధం చేయాలని కమిషనర్ తెలిపారు. ఆయా వివరాలను తరువాత వారంలో సమర్పించడం వలన నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని ఆయన అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసి రావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, సీసీపీ సునీత, సిఎంఒహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, డి.డి.హెచ్. దామోదరావు, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రావు, ఎఫ్.ఎ & ఎ.ఓ మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్ రవి, వినయ్ కుమార్, వేణుగోపాల రావు, కృష్ణారావు, గోవింద రావు, రామ్మోహన్ రావు, డిపిఓ చక్రధర్, పి.ఓ.(యుసిడి) సూర్య కళ, డిసిపిలు, ఎసిపిలు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్ 3 ప్రయోగానికి మోదీ..?

కోల్పోయింది. ఆ ప్రయోగం విఫలమవడంతో అప్పటి ఇస్రో ఛైర్మన్ కె.శివన్ తీవ్ర భావోద్వేగానికి గురవ్వగా.. అక్కడే ఉన్న ప్రధాని మోదీ ఆయనను ఓదార్చారు. ఇక, జులై 14న చేపట్టనున్న చంద్రయాన్-3 45 రోజుల పాటు ప్రయాణించి ఆగస్టు చివరి నాటికి దీని రోవర్ జాబిల్లిపై పాదం మోపే అవకాశముంది. కాగా.. దీన్ని ఫెయిల్యూర్ ఆధారిత విధానంతో అభివృద్ధి చేసినట్లు ఇస్రో తెలిపింది. ఈ ప్రయోగం విజయవంతమైతే.. చంద్రుడి ఉపరితలంపై తమ వాహకనౌకలను ల్యాండ్ చేయగలిగిన నాలుగో దేశంగా భారత్ అవతరించనుంది. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనా దేశాలు మాత్రమే ఈ ఘనత సాధించాయి. 2008లో భారత్ చంద్రయాన్-1 ప్రయోగం చేపట్టినప్పటికీ అందులో ల్యాండర్ లేదు. ఆర్బిటర్, ఇంపాక్టర్‌తో జరిపిన ఆ ప్రయోగం విజయవంతమై.. జాబిల్లి ఉపరితలంపై నీటి జాడలను గుర్తించింది.

# రాష్ట్రపతితో నిర్మల సీతారామన్ భేటీ..

కూడా ఈ సమావేశానికి హాజరవుతాయని జాతీయ మీడియా అంచనా వేస్తోంది. మరోవైపు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ కూడా ఎన్డీయేతో చెట్టపట్టాలు వేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ప్రతిపక్షాల ఐక్యత కోసం నితీశ్ గట్టిగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీని గద్దె దించేందుకు ఆయన అనేక పార్టీలతో చర్చలు జరుపుతున్నారు. ఇదిలావుండగా, నిర్మల సీతారామన్ వద్ద ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ గా పని చేస్తున్న వివేక్ సింగ్ పదవీ కాలాన్ని కుదించారు. జూలై 17తో ఆయన పదవీ కాలం ముగిసే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ఆయన వ్యక్తిగత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఆఫీస్ మెమొరాండం తెలిపింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో నిర్మల సీతారామన్ భేటీ అయినట్లు రాష్ట్రపతి భవన్ సోమవారం ఓ ట్వీట్ చేసింది. మోదీ ఈ నెల 13, 14 తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటిస్తారు. పారిస్‌లో ఈ నెల 14న జరిగే బాస్టిల్లే డే పెరేడ్‌లో గౌరవ అతిథిగా పాల్గొంటారు.

# స్వచ్ఛ పక్వాడ ప్రచార రథాలను ప్రారంభించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ తో పాటు హెచ్పీసీఎల్ ఎంతో కృషి చేస్తుందన్నారు. సోమవారం ఆయన మల్కాపురంలోని హెచ్పిసిఎల్ రిఫైనరీ లో హెచ్పిసిఎల్ సంస్థ ఏర్పాటు చేసిన స్వచ్ఛత పక్వాడ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ లో హెచ్పీసీఎల్ సంస్థ 2014 నుండి సహకారం అందిస్తుందని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ కొరకు హెచ్పీసీఎల్ సంస్థ జివిఎంసి పరిధిలోని 8 జోన్లలో స్వచ్ఛ సర్వేక్షన్ ప్రసారం కొరకు 8 ఆటోలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ ఆటోలతో స్వచ్ఛ సర్వేక్షణపై జులై 15వ తేదీ వరకు ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. 8 జోన్లలో “కళాజాత” ద్వారా వీధి నాటకాలతో ప్రచారం చేయడం జరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఇవే కాకుండా రేడియో ఎఫ్ఎం ల ద్వారా ప్రసారం చేస్తున్నామని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమం లో పాలుపంచుకొని జివిఎంసికి సహకరిస్తున్న హెచ్పిసిఎల్ రిఫైనరీ సంస్థ జనరల్ మేనేజర్ ను వారి యాజమాన్యాన్ని కమిషనర్ అభినందించారు.

# అంగన్వాడీల ఆందోళనకు సంపూర్ణ మద్దతు

## – సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** అంగన్వాడీలు చేపట్టిన 36 గంటల ధర్నాకు సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోంది. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చేయాలని చేపట్టిన న్యాయమైన ఆందోళనను సిపిఎం బలపరుస్తోంది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచడంతో పాటు గ్యాస్ నేరుగా అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే సరఫరా చేయాలి. 2017 నుండి ఇవ్వాల్సిన టిఎ, డిఎలు తక్షణమే అంగన్వాడీలకు చెల్లించాలి. రాజకీయ జోక్యం, వేధింపులు, పని భారాన్ని తగ్గించాలి.

పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే వేతనాలు పెంచి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

# అవంతి ఆదేశాలతో రహదారి పనులు పూర్తి



మధురవాడ (విజయభాను న్యూస్) : ఎమ్మెల్యే అవంతి చొరవతో రేవాళ్ళపాలెం గ్రామంలో రహదారిని పునరుద్ధరించారు. మహా విశాఖ 6 వ వార్డు పరిధి రేవల్లపాలెం గ్రామంలో గత కొంత కాలంగా 80 అడుగుల రోడ్డు విస్తీర్ణ ఆగిపోవడంతో రోడ్డు కూడా పూర్తిగా పాడై రాకపోకలకు ఇబ్బందిగా మారింది, దీనిపై శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే అవంతి, దృష్టికి తీసుకురావడంతో వారి ఆదేశాలమేరకు సోమవారం అధికారులు రహదారికి మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనితో 32 కుటుంబాలకు న్యాయం జరిగేలా చేసి రోడ్డు పూర్తి చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేసినట్లు వైసీపీ నాయకుడు పిళ్ళా రమణ తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పరాజు, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గున్నారు.

# విశాఖలో బాలికపై అత్యాచార మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

## – ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి పద్మ డిమాండ్



ద్వారకా నగర్ (విజయభాను న్యూస్): విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ మాట్లాడుతూ విశాఖలో ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 104 ఏరియా బాపూజీ నగర్ లో బాలికపై కీచకులు అతి దారుణంగా స్కూల్ అటెండర్ మరో నలుగురు కలిసి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ బాలిక ను ఆ స్కూల్ అటెండరే సత్యారావు కొంతకాలంగా వేధిస్తూ వివస్త్రను చేసి ఫోటోలు తీసి బ్లాక్ మెయిలింగ్ కి పాల్పడ్డాడు. అంతేకాకుండా తన మిత్రులను పంపించి ఆమెపై అత్యాచారం చేసే విధంగా ఈ క్రూర మృగం పాల్పడ్డాడు. ఆ బాలిక బంగారు భవిష్యత్తును నాశనం చేశారు. ఈ కాలంలో విశాఖపట్నంలో ఇటువంటి దారుణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఒకవైపు ప్రభుత్వాలు బేటి బచావో - బేటి పడావో అనే ప్రధాన మంత్రి గారి ప్రచారం చేస్తున్నారు. రెండో వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా దిశా యాక్ట్ వచ్చింది. దాన్ని డౌన్లోడ్ చేసుకోండి అని వేల కోట్ల రూపాయలు పెట్టి ప్రచారం చేస్తున్నారు. ఆచరణలో మాత్రం మహిళలకు రక్షణ లేకుండా పోతుంది. సభ్య సమాజం తలదించుకునేలా ఈ రకమైన ఘటనలు జరుగుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి ఈ మానవ మృగాలను సమాజంలో తలెత్తుకోకుండా కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేస్తున్నది. చిన్నారులపై, బాలికలపై మహిళలపై విపరీతంగా పెరిగిపోతున్నాయి. చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ ఇలాంటి మృగాలు తప్పించుకు తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మహిళలపై జరుగుతున్న హింస ను కట్టడి చేయడానికి ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలని అయితే డిమాండ్ చేస్తున్నది. రాష్ట్ర మహిళా కమిషన్ వెంటనే జోక్యం చేసుకొని ఆ బాలికకు న్యాయం జరగాలని, పోస్కో చట్టం క్రింద కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.విమల, మమత, నిర్మల, కె.కుమారి, ఏ . పుష్ప, జి. లక్ష్మి, ఓ. విజయ, హేమలత, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ఐలా తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై అత్యాచార దోషులందరినీ కఠినంగా శిక్షించాలి

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖలో ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 104 ఏరియా బాపూజీ నగర్‌కు చెందిన విద్యార్థిని మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన దోషులందరినీ సమగ్ర విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ ఘటనలో అటెండరు వ్యవహరించిన తీరు సభ్యసమాజం తలదించుకునేదిగా వుంది. ఈవ్యక్తి, ఇతడి స్నేహితులు మానవ మృగాల్లా బాలికపై తెగబడటం అత్యంత ఆందోళన కరం. బాలికలపైన, మహిళలపైన అఘాయిత్యాలకు పాల్పడటం వీడియో తీసి బ్లాక్ మెయిల్ చేయడం ఈకాలంలో పెరిగిపోతున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో %--%బేటీ పడావో అంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టం తీసుకు వచ్చాం. మహిళల భద్రత మాలక్ష్యం అంటున్నాయి. కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కానీ! ఈప్రచారానికి జరుగుతున్న ఘోరాలకు పొంతన లేకుండా పోతోంది. భారత సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని కొనియాడుతారు. మరోవైపు ఈ ఉన్నతమైన సంస్కృతిని విచ్ఛిన్నం చేసే విధానాలను పాలకులు పెంచి పోషిస్తున్నారు. విదేశీ విష సంస్కృతిని విచ్చలవిడిగా దిగుమతి చేస్తున్నారు. మహిళలను అంగటిలో సరుకుగా వ్యాపార వస్తువుగా దిగజారుస్తున్నారు. యువతను పెడమార్గం పట్టిస్తున్నారు.

పాలకులు ఎన్ని చట్టాలు చేసినా బాలికలపైన, మహిళలపైన అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోవడం అత్యంత ఆందోళనకరం. బాలాజీనగర్ ఘటన మనుషులుగా వున్న మృగాలు చేసినపని. ప్రభుత్వం ఈఘోరంపై సమగ్ర విచారణ జరిపించాలి. దోషులందరినీ కఠినంగా శిక్షించాలి. బాలికలకు, మహిళలకు పూర్తి రక్షణ కలిగించే విధానాలను ప్రభుత్వం చేపట్టాలి. హింసను కట్టడి చేయడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణను వేగవంతం చేయాలి. రాష్ట్ర మహిళా కమిషన్ వెంటనే జోక్యం చేసుకొని బాలికకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది.

# ప్రతి గడపకు త్రాగునీరు ప్రతి సెంటుకి సాగునీరు

## ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస : ఈ నియోజకవర్గంలో ప్రతి గడపకు త్రాగునీరు ప్రతి సెంటుకు సాగునీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు ఆమదాలవలస మండలం బెలమాం గ్రామంలో సుమారు 50 లక్షల నిధులతో మరియు లద్దలపేట గ్రామంలో సుమారు 35 లక్షల నిధులతో జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో దేశానికి రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు అభివృద్ధి సంక్షేమం రెండు కల్లుగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కనుగుల కిషోర్, మండల యువజన విభాగ అధ్యక్షులు బెండి గాంధీ, సర్పంచ్ సీతాన మల్లేశ్వరరావు పంచాతీ పాపారావు తమ్మినేని గురునాధరావు పూజారి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# స్పందన అర్జీలు సకాలంలో పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



శ్రీకాకుళం, జూలై 10 : స్పందన అర్జీలు సకాలంలో పరిష్కారం చూపాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తోపాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇంచార్జ్ డిఆర్ఓ మురళీ కృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డి.ఆర్.డి.ఎ, పి.డి విద్యాసాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందన, ఏపీ సేవా, మీసేవా కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను సావదానంగా వింటూ, వివిధ సమస్యల పై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తుల వివరాలు శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సకాలంలో పరిష్కరించడం ముఖ్యమన్నారు. ప్రత్యేక దృష్టి సారించి గ్రీవెన్స్ ను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు. నాణ్యతగా గ్రీవెన్స్ కు పరిష్కారించాలన్నారు, 23 రీఓపెన్ పెండింగ్ లో ఉన్నాయని సాయంత్రం లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు గ్రీవెన్స్ పరిష్కారం పై ప్రతిరోజు మోనేటరింగ్ చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్ సంబంధిత అధికారులు ఓపన్ చేసి ఎట్ టు వ్యూ లో పెండింగ్ లో ఉన్నవి సత్వరం పరిష్కరించాలన్నారు. అలాగే వై.ఎస్.ఆర్.భీమాకు సంబంధించి 11 దరఖాస్తులు పెండింలో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం -232 అర్జీలు వచ్చాయి.

ఈ స్పందన కార్యక్రమంలో డి.ఎస్.ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డి.ఎం.అండ్.హెచ్.ఓ డా.బి. మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# పెద్దగెడ్డ నీటిని విడుదల చేసిన ఉపముఖ్యమంత్రి



సాలూరు, విజయభాను న్యూస్ : సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో ఉన్న పెద్దగడ్డ రిజర్వాయర్ కుడి కాలువ నీటిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు పీడిక రాజన్న దొర, బొబ్బిలి నియోజకవర్గం ఎమ్మెల్యే శంబంగి చిన అప్పల నాయుడులు నీటిని విడుదల చేశారు. పెద్దగెడ్డ రిజర్వాయర్ ద్వారా ఐదు మండలాలు పొలాలకు నీరు అందుతుంది తెలిపారు. సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలం, సాలూరు మండలం, సాలూరు టౌన్, రామభద్రపురం మండలం, బాడింగి మండలాలకు సంబంధించి పొలాలకు నీరు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం ఎంపీపీ చొక్కా లక్ష్మణరావు, పాచిపెంట ఎంపీపీ ప్రమీల, చినబాబు, పాచిపెంట మండల వైసిపి పార్టీ అధ్యక్షులు గొట్టపు ముత్యాల నాయుడు, వైసీపీ పార్టీ జిల్లా కార్యదర్శి డోల బాబ్జి, సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్దగెడ్డ రిజర్వాయర్ డి ఇ కనకా రావు, ఏఇలు, అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి రచయితకు తెలుగు విశ్వవిద్యాలయం లో అవార్డు



భీమునిపట్నం : విజయ భాను న్యూస్ : 2022 లో ముల్కనూరు ప్రజా గ్రంధాలయం, నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో నిశ్శబ్ద గీతం కథకు రూ. 5 వేలు, ప్రశంసాపత్రం బహుమానం వచ్చినట్లు భీమిలి కి చెందిన ప్రముఖ రచయిత పొత్తూరి రాజేంద్రప్రసాద్ చెప్పారు. హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయంలో కదా రచయిత అవార్డ్ ను ప్రధానం చేసినట్లు తెలిపారు. తెలుగు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ కిషన్ రావు సన్మానించారనీ . అలాగే తను రాసిన 300 కథలు ఇంతవరకు వివిధ పత్రికల్లో ప్రచురణ జరిగాయనీ, నవలల్లో గంజాయివనం, అంపశయ్య నవీన్ పురస్కారం పొందిందనీ చెప్పారు. అంతేకాకుండా భీమిలి చారిత్రక కథలు కూడా రాసినట్లు తెలిపారు. అంతేకాకుండా అల్లూరిపై చేసిన పరిశోధనకు గతవారం విజయవాడ లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అవార్డ్ బహూకరించడం చాలా ఆనందంగా ఉందనీ అన్నారు. ప్రస్తుతం వర్మ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. పి. ఆర్. టి. యూ సంఘానికి జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. వర్మకు కథా రచనలో అవార్డ్ రావడం పట్ల పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బలగం చిత్ర దర్శకుడు నటుడు వేణు,తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో

# స్వచ్ఛ పక్వాడ ప్రచార రథాలు ప్రారంభం



ములగాడ(విజయభాను న్యూస్) : స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ తో పాటు హెచ్పీసీఎల్ ఎంతో కృషి చేస్తుందని జీవీఎంసీ కమీషనర్ సి ఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన మల్కాపురంలోని హెచ్పిసిఎల్ రిఫైనరీ లో హెచ్పిసిఎల్ సంస్థ ఏర్పాటు చేసిన స్వచ్ఛత పక్వాడ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ లో హెచ్పీసీఎల్ సంస్థ 2014 నుండి సహకారం అందిస్తుందని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ కొరకు హెచ్పీసీఎల్ సంస్థ జివిఎంసి పరిధిలోని 8 జోన్లలో స్వచ్ఛ సర్వేక్షన్ ప్రసారం కొరకు 8 ఆటోలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ ఆటోలతో స్వచ్ఛ సర్వేక్షణపై జులై 15వ తేదీ వరకు ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. 8 జోన్లలో "కళాజాత" ద్వారా వీధి నాటకాలతో ప్రచారం చేయడం జరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఇవే కాకుండా రేడియో ఎఫ్ఎం ల ద్వారా ప్రసారం చేస్తున్నామని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమం లో పాలుపంచుకొని జివిఎంసికి సహకరిస్తున్న హెచ్పిసిఎల్ రిఫైనరీ సంస్థ జనరల్ మేనేజర్ ను వారి యాజమాన్యాన్ని కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ పి సి ఎల్ యాజమాన్యం, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ సేవలు ప్రశంసనీయం

**– నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నాగరాజు, వర్మ రాజు..**

**– ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు**



విశాఖపట్నం, విజయ భాను న్యూస్ : దేశవ్యాప్తంగా అలాగే విశాఖలో 22 క్లబ్ ల ద్వారా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ జీవీఎల్ నరసింహారావు కొనియాడారు. నగరంలో స్థానిక హొటల్లో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ నూతన అధ్యక్ష కార్యదర్శులు నియామక సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా రోటేరియన్ నేతాజీ సభకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎం.పీ. జీవీఎల్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అందిస్తున్న విరాళాలు శ్లాగనీయమని, అలాగే మత్స్యకారులకు ప్రాథమిక విద్య నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో సంఘటతంగా 25వేల సంఘాలతో మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు ఈ సందర్భంగా వెల్లడించారు. వారి సంఖ్య 2.50 లక్షల కుటుంబాలు పైగా ఉన్నాయన్నారు. వారిలో కొంతమందికి నైపుణ్యం శిక్షణ కల్పించాలని కోరారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలలో కలిసి తాను కూడా పనిచేస్తానని వెల్లడించారు. అలాగే జన శిక్షణ సంస్థాన ద్వారా సామాన్యులకు కూడా శిక్షణ ఇప్పించి అన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగాలను మీతో కలిపి పనిచేయించాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులు పి నాగరాజు, ఎం వర్మ రాజులు మాట్లాడుతూ రోటరీ క్లబ్ అందించిన సేవలు వివరిస్తూ భవిష్యత్తులో మరింత గా సేవలు విస్తృతం చేస్తామని వివరించారు. అనంతరం నూతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ను ప్రకటించారు. అలాగే వికలాంగులకు బియ్యం బస్తా, ఆయిల్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ జి కృష్ణమూర్తి, ఫాస్ట్ సెక్రెటరీ జి వంశీ చక్రధర్, పిడిజి సి. హెచ్ కిషోర్ కుమార్, అసిస్టెంట్ గవర్నర్ బి బ్రహ్మానందం, మాజీ అసిస్టెంట్ గవర్నర్ చింతా నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ సంఘం పుస్తకాలు ఆడిట్ తప్పనిసరి



శిక్షణ ఇస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం (విజయభాను న్యూస్) : డ్వాక్రా సంఘాల్లోని ప్రతీ సంఘం పుస్తకం తప్పనిసరిగా ఆడిట్ జరగాలని వైఎస్ఆర్ క్రాంతి పథం రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. సోమవారం మండలంలో వీఆర్ అగ్రహారం గ్రామంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాలకు చెందిన వెలుగు సిబ్బందికి ఆడిట్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఏ.కల్యాణ చక్రవర్తి ఆదేశాలు మేరకు క్లస్టర్ స్థాయిలో వీఆర్ అగ్రహారం గ్రామ సంఘం పరిధిలో 29 స్వయం సహాయక సంఘాలకు అంతర్గత ఆడిట్ పైలట్ గా నిర్వహిం చడం జరిగిందని అన్నారు. ఈ ఆడిట్ చేయుటకు నియోజకవర్గ స్థాయిలో ఉన్న అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలు, సీఎఫ్ లు పాల్గొనడం జరిగిందని తెలిపారు. సంఘాలు ఏర్పడి నప్పటి నుండి సంఘం వారీగా సభ్యులు పొదుపు చేసుకున్న మొత్తం, పోదుపులు నుండి తీసుకున్న అంతర్గత అప్పులు, బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీ నిధి, ఉన్నతి సీఐఎఫ్ రుణాలకు సంబంధించిన లెక్కలు సరి చూడటంతో పాటు సిబ్బందికి క్షేత్ర స్థాయిలో శిక్షణలా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ ఆడిట్ నిర్వహణ వలన పొదుపు, అప్పు నిల్వలు తెలుస్తాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హత పొందిన వారి జాబితా తెలుస్తుందన్నారు. మంగళవారం నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో ఈ ఆడిట్ జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు దధికుమార్, మంగమ్మ, చక్రపాణి, సీతారాం, రాము, అప్పలనాయుడు, శేషగిరిరావు, స్త్రీ నిధి మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

## కాశీపట్నం ఎస్సీ కాలనీలో సోలార్ తాగునీటి పథకాన్ని ప్రారంభించిన ఎంపీపీ శెట్టి నీలవేణి





**అనంతగిరి, విజయభాను. న్యూస్ :** అరకులోయ శాసన సభ్యులు చెట్టి పాల్గుణ హామీని నెరవేర్చిన ఎంపీపీ, మండలం లోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకుగాను మండల పరిషత్ నిధులతో నిర్మించిన సోలార్ తాగునీటి పథకాన్ని ఎంపీపీ శెట్టి నీలవేణి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. సుమారు 7:50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ పథకాన్ని ఆమె ప్రారంభించి కాలనీలో దాహార్తిని తీర్చారు. గతంలో కాశీపట్నం సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో అరకులో శాసనసభ్యులు చెట్టి పాల్గుణ గారు పర్యటించిన సమయంలో తాగునీటి సమస్యను ఆయన దృష్టికి ప్రజలు తీసుకుని వెళ్లారు. ఈ మేరకు మండల పరిషత్ నుంచి నిధులను కేటాయించి ఆయన హామీని నెరవేర్చారు. శాసనసభ్యులు ఆదేశాల మేరకు తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలతో పాటు గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తీర్చి తెలుసుకుంటూ ఒక్కొక్కటిగా నెరవేర్చే క్రమంలోలో ముందుకు వెళుతున్నామని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జనపరెడ్డి లక్ష్మి ఎంపీటీసీ సభ్యులు తవిటినాయుడు అశోక్ ,షేక్ మదీనా ఉపసర్పంచ్ రాంబాబు ,మాజీ ఉప సర్పంచ్ ఎర్రిబాబు మాజీ సర్పంచ్ దేముడు వైఎస్ఆర్సిపి నాయకులు సీత, సత్యవతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# హెరిటేజ్ పాడిరైతులకు ఉచిత పశువైద్య శిబిరం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్ ) : పాడిరైతులు ఉచిత పశువైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ వి దివాకరరావు అన్నారు. సోమవారం మునగపాక మండలం మూలపేట గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హెరిటేజ్ లో పాలు పోసిన పాడిరైతులు పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ 50 రూపాయలకు అందించబడును తెలిపారు అంతేకాకుండా హెరిటేజ్ డైరీ రీజనల్ మేనేజర్ . నాగ అప్పారావు పాడి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు హెరిటేజ్ డైరీ కి పాలు సరఫరా చేస్తున్న ప్రతి గ్రామములో పశువులకు కృత్రిమ గర్భధారణ అందరికీ అందుబాటులో ఉంటావని తెలిపారు . అందరికీ ఉచితంగా మందులు అందజేశారు. హెరిటేజ్ మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ పాలకు జిల్లాలో అన్ని డైరీలు కంటే ఎక్కువ రేటు చెల్లిస్తుందని అదేవిధంగా హెరిటేజ్ కి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతు యాక్సిడెంట్ లో చనిపోతే రెండు లక్షలు, సహజ మరణానికి 50,000 రూపాయలు హెరిటేజ్ డైరీ కుటుంబం నామినికి అందజేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో...

డాక్టర్ ప్రవీణ్ కుమార్, రాము కుసరాజ నాగఅప్పారావు , రామచంద్ర రావు, సూర్యనారాయణ, .త్రినాథ్, పర్సునాయుడు రామచంద్రరావు ,సత్యనారాయణ తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

# విజయమే లక్ష్యంగా పనిచేయాలి



కాకినాడ, విజయభాను న్యూస్ : విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైసిపి గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ఆర్‌టిఒ రోడ్డులోని అక్షయ ఫంక్షన్ హాల్లో వైసిపి జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లడారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. అందుకోసం నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రసంగాలు 2014 నుంచి ఒకే రకంగా ఉన్నాయన్నారు. 2019లో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని కానివ్వనని సపథం చేసి ఓడిపోయాడన్నారు. ప్రస్తుతం కాకినాడలో యాత్రలో పవన్ కళ్యాణ్ ప్రసంగించిన తీరు అభిమానులను, ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు పొందాలనే విధంగా సాగిందన్నారు. పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలపై అవగాహన లేదని, టిడిపి స్క్రిప్ట్‌నే ఆయన చదువుతారని విమర్శించారు. జనసేన ఎన్నిస్థానాల్లో పోటీ చేస్తుందనేదానిపై ఆయనకే క్లారిటీ లేదన్నారు. ఇక వైసిపిని ఎక్కడ అడ్డుకుంటారని ప్రశ్నించారు. జనసేన 35 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పుకుంటుంటే, 15 సీట్లకు మించి ఇచ్చేది లేదని టిడిపి అంటుందన్నారు.

# విజయభాను సంపాదకీయం

## చంపుకొనే ప్రేమలెందుకు?

నిజమైన ప్రేమ అజరామరమైనది. అది ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుందన్నమాట తప్పని రుజువౌతోందా? అంటే అవుననే నిరూపిస్తున్నాయి ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు.గత కొన్నాళ్లగా మనదేశంలో ప్రేమికుల చేతుల్లో ముక్కలు,ముక్కలుగా నరకబడుతున్న ప్రియురాండ్ల శరీర భాగాలు దీన్నే నిరూపిస్తున్నాయి.

నిజమైన ప్రేమ అజరామరమైనది. ది ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుందన్నమాట తప్పని రుజువౌతోందా? అంటే అవుననే నిరూపిస్తున్నాయి ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు.గత కొన్నాళ్లగా మనదేశంలో ప్రేమికుల చేతుల్లో ముక్కలు, ముక్కలుగా నరకబడుతున్న ప్రియురాండ్ల శరీర భాగాలు దీన్నే నిరూపిస్తున్నాయి. ప్రేమ తమకు దక్కనప్పుడు త్యాగాన్ని కాదు..ద్వేషపు విషాన్ని విరజిమ్ముతున్న వైనం ఆందోళన కలిగిస్తున్నది.

గతేడాది నవంబరులో ఢిల్లీలో జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకుందాం. శ్రద్ధావాకర్, ఆఫ్తాబ్ ఒకరినొక రు ప్రేమించుకొన్నారు. అయితే వారి కుటుంబా లు ఒప్పుకోక పోవడంతో అది పెండ్లికి దారితీయలేదు. దీంతో శ్రద్ధా వాకర్ తన తల్లిదండ్రులను కాదనుకొని తన ప్రియుడైన ఆఫ్తాబ్‌నే జీవిత సర్వస్వంగా భావించి అతనితో వెళ్లి పోయింది. నాలుగేండ్ల పాటు ఇద్దరూ సహజీవనం చేశారు. ఆ సమయంలో తనను పెండ్లి చేసుకోవాలని ఒత్తి డి తీసుకు రావడంతో పెండ్లి ఇష్టంలేని ఆఫ్తాబ్ ఆమెను వదిలించుకోవడానికి హంతకుడిగా మా రాడు. శ్రద్ధను 35 ముక్కలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడేశాడు. దీనికి కొనసాగింపుగా పంజాబ్‌లో యూపీలో, బీహార్‌లో ఇలాంటి హేయమైన సంఘటనలే జరిగాయి. ఇటీవల ఢిల్లీలో మరో పదహారేండ్ల బాలికను ఆమె ప్రియుడు 34 కత్తిపోట్లతో అత్యం త కిరాతకంగా హత్య చేసిన వైనం ఆందోళన కలిగిస్తున్నది.

విఫలప్రేమలు ఇప్పటివేం కాదు..

దేవదాసు-పార్వతి, హీర్-రాంజా, సలీం-అనార్కలి. రోమియో.-జూలియట్‌ల ప్రేమకథ లు మనకు తెలిసినవే. ఈ కథల్లో పేమను త్యాగం చేసి ప్రేమ అనే పదానికి జీవం పోసిన ఉదంతాలే కనిపిస్తాయి. లేదంటే ప్రేమకోసం ఇద్దరూ తమ ప్రాణాలను త్యాగం చేసిన సందర్భాలే కనిపిస్తా యి. అదే విధంగాప్రేమలో మోసపోయి తమ ప్రేమికుల ఎడబాటును తట్టుకోలేక ఇద్దరిలో ఎవ రో ఒకరు బలవన్మరణాలకు పాల్పడిన ఘటన లూ ఉన్నాయి.

ఇక కొన్ని ప్రేమలు పరువు హత్యలకు దారి తీసిన సందర్భాలున్నాయి. తక్కువ కులం వారిని ప్రేమించారనే నేపంతో అమ్మాయి తల్లిదండ్రులు సదరు అబ్బాయినో, లేదా వారి అమ్మాయినో, మరికొన్ని సందర్భాల్లో ఇద్దరినో కడతేరుస్తున్నారు. వీటన్నింటికి భిన్నంగా ఇప్పు డు ప్రేమికులే ఉన్మాదులుగా మారుతున్నారు.ఈతరం ప్రేమికులు తమ ప్రేమ విఫలమైనప్పుడు మృగాలుగా మారుతున్నారు. తమ ప్రి యురాండ్లను ముక్కలుగా నరికి చెట్టుకో, పుట్ట కో పడేస్తున్నారు. ఇలాంటి ఘోరాలలో వారి మానసిక స్థితిని అంచనా వేసే క్రమంలో తల పండిన సైకాలజిస్ట్‌లకే వెన్నులో వణుకుపుడుతున్న సందర్భాలు లేకపోలేదు.నాలుగైదేండ్లు తమతో సహజీవనం తర్వాత ఓ మనిషి తన జీవన సహ చరిని చంపాలన్నంత కోపం ఎందుకొస్తున్నది. కొన్ని సందర్భాల్లో శరీరభాగాల్లో కొన్నింటిని ఇంట్లోనే ఉంచుకొని ఇతర పనులు చేసు కోవడమో, మరో అమ్మాయితో గడ పడమో చేస్తున్నారంటే వారి మానసిక స్థితిని అర్థం చేసు కోవచ్చు.ఈ మధ్య కాలంలో ఇలాంటి కిరాతక ప్రవృత్తి ప్రేమికుల నుంచి వివాహేతర సంబంధాల వలలో చిక్కు కున్న వారికి వ్యాపి స్తున్నది. తమ అక్రమ లైంగిక సంబం ధాలను కప్పి పుచ్చుకోవడానికి తమ జీవిత భాగస్వాములను సైతం ఆనవాళ్ళు దొరకకుండా చేస్తున్నారు. ఈ విషయంలో ఆడవారి పాత్రే ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో వారిలో ఈ అమానవీయ రాక్షస ప్రవృత్తిని కలిగి స్తున్నదెవరో తెలుసుకోలేక పోతే పరిస్థితులు మరింత విషమించి పోయే ప్రమాదం లేక పోలేదు.ఇలాంటి హేయ మైన నేరాల పరిశోధనలో భాగంగా సంబంధిత అధికారులు నిందితులను ఇంటరాగేట్ చేస్తునప్పుడు అనేక ఆందోళన కరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి.

## 'ఏపీ 31'లో సీఐ స్వర్ణలత హీరోయిన్ కాదు.. దర్శకుడు క్లారిటీ

ప్రొద్దుటూరు: ఏపీ 31 సినిమాలో ఏఆర్ సీఐ స్వర్ణలత హీరోయిన్ కాదని దర్శకుడు కేవీఆర్ స్పష్టం చేశారు. సినిమాలో ఆమెది అతిథి పాత్ర మాత్రమేనని వెల్లడించారు. ఈ మేరకు వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏపీ 31'లో స్వర్ణలత పెట్టుబడి పెట్టలేదని.. ఈ చిత్రంలో బిగ్‌బాస్ ఫేమ్ లహరి హీరోయిన్‌గా చేస్తున్నట్లు వివరించారు. స్వర్ణలతకు సంబంధించి వైరల్ అయిన వీడియోలు తమ సినిమాలోనివి కాదని చెప్పారు.

అయితే, నోట్ల మార్పిడి వ్యవహారంలో బెదిరించి డబ్బులు గుంజిన కేసులో ఇటీవల ఏఆర్ సీఐ స్వర్ణలత అరెస్టు కావడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. వృత్తిలో అనేక రకాల ఆరోపణలు ఎదుర్కొన్న ఆమె.. ప్రవృత్తి పరంగా వెండితెరపై మక్కువ పెంచుకున్నారు. సినిమాలపై ఆసక్తి ఉన్న స్వర్ణలత కొంతకాలం క్రితం ఓ పాటకు డ్యాన్స్ చేశారు. చిరు ప్రయత్నం అంటూ ఆ వీడియోతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశారు. తాను తీయబోయే సినిమాలో మంచి పాత్ర ఇస్తానని, ఇందుకు డ్యాన్స్‌లో ప్రావీణ్యం ఉండాలని ఓ ప్రజాప్రతినిధి చెప్పడంతో ఒక కొరియోగ్రాఫర్‌ను నియమించుకుని సాధన చేస్తున్నారు. ఇందులో భాగంగానే పలు వీడియోలు తీశారు. ఆమె అరెస్టు కావడంతో యూట్యూబ్‌లో ఈ వీడియోలు వైరల్‌గా మారాయి.

# సత్యభామ నృత్యోత్సవం అదరహో..!





**డా. వేదాంతం రామలింగ శాస్త్రికి శోభానాయుడు ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం**

**గీతానారయణ్‌కు సత్యభామ ఎక్స్‌లెన్స్-2023, ఏడుగురికి బెస్ట్ టీచర్ అవార్డులు**

**ఆహుతులను అలరించిన కూచిపూడి నర్తకి చిరంజీవి కాంద్రేగుల రూపా గాయత్రి**



కూచిపూడి నర్తకి చిరంజీవి కాంద్రేగుల రూపా గాయత్రి

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో తొమ్మిదోసారి అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న సత్యభామ యువ నృత్యోత్సవలు అంగరంగవైభవంగా ముగిసాయి. ప్రపంచం నలు చెరగుల నుంచి ఈ ఉత్సవంలో పాల్గొన్న భారతీయ సంప్రదాయ నాట్యకళా ప్రదర్శనలు అదరహో అనిపించాయి. మెరుపు వేగంతో మారిపోయే హావభావాలు, అందానికే కన్నుకుట్టే అద్భుతమైన భంగిమలు, సనాతన ధర్మాలను కళకళ్లకు కట్టే ప్రదర్శనా నైపుణ్యాలు వెరసి నృత్యోత్సవం భారతీయతకు అద్దంపట్టింది. విలువలను అందలమెక్కించింది. ప్రేక్షకుల హర్షధ్వనాల మధ్య కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు గ్రహీత, కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్స్‌పాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రికి నిర్వాహకుల తరపున ముఖ్య అతిథి ఆదాయపన్నుల శాఖ కమిషనర్ ఎస్. రవిశంకర్ నారాయణ్, గౌరవ అతిథి అనాకాపల్లి పోలీస్ సూపరింటెండెంట్ కేవీ మురళి, ఫెస్టివల్ డైరెక్టర్, ద డ్యాన్స్ ఇండియా ఎడిటర్ బత్తిన రంగ విక్రమ్ కుమార్(గౌడ్), విశిష్ఠ అతిథులు సాయి వెంకటేష్, జగబంధు జెనా చేతుల మీదుగా పద్మశ్రీ డాక్టర్ కె. శోభానాయుడు ఎక్స్‌లెన్స్ అవార్డు-2023 ప్రదానం జరగడం ఈ ఉత్సవాలకే తలమానికం. విశాఖకు చెందిన ప్రముఖ కూచిపూడి నర్తకి సూడగాని గీతా నారాయణ్ సత్యభామ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. కేరళకు చెందిన ప్రఖ్యాత మోహినీయాట్టం కళాకారిణి చిత్ర సుకుమారన్ జ్యూరీ ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నారు.

నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమికి చెందిన కూచిపూడి నర్తకి చిరంజీవి కాంద్రేగుల రూప గాయత్రి ( లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్ కుమార్ కుమార్తె ) నృత్యం ఆహుతులను అలరించాయి. నిర్మల నృత్యనికేతన్, శ్రీ లలిత కళాసమితి, నర్తనశాల డ్యాన్స్ అకాడెమీ, కృష్ణ కళామందిర్, శ్రీ సిద్ధేంద్రయోగి కళా నిలయం, సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ తదితర బృందాలు చక్కటి కూచిపూడి నృత్యాలతో ప్రేక్షకుల మెప్పు పొందాయి. డాక్టర్ పేరాల బాలమురళీ కృష్ణ సమయోచితమైన అద్భుత విశ్లేషణలు అలవోకగా చేసే పదబంధ వర్ణనలు ప్రేక్షకుల్ని ఆసాతం కట్టిపడేశాయి. విశేష సంఖ్యలో హాజరైన ప్రేక్షకులతో ఆడిటోరియం కిటకిటలాడింది.

# ప్రజా సంక్షేమం అమలులో వాలంటరీ వ్యవస్థ కీలకం

**- వాలంటీర్లకు పవన్ కళ్యాణ్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలి**

**- అనుచిత వ్యాఖ్యలుకు నిరసనగా మానవహారం నిర్వహించిన కె.కె రాజు**




తాటిచెట్ల పాలెం (విజయభాను న్యూస్): వాలంటీర్ల వ్యవస్థ పైన జనసేనా అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం విశాఖ ఉత్తర నియోజక వర్గం తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు ఆధ్వర్యంలో మానవ హారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ప్రజా సంక్షేమ పథకాల అమలలో ప్రజలకు నూటికి నూరు శాతం న్యాయం చేసే విధంగా అనేక రకాల సంక్షేమ పథకాలను రూపకల్పన చేసి ఈ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయ టంలో కీలక పాత్ర పోషించేందుకు వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలోనే పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి మంచి కార్యక్రమం చేపడుతున్న వాలంటీర్ వ్యవస్థ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనిచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. దీనికి బేషరతుగా పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు ఆళ్ళ లీలావతి, శ్రీనివాస్, పి.ఉషశ్రీ,కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, చల్లా రజిని ఈశ్వరరావు, కె వి ఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, పైడిరమణ, దుప్పల పూడిశ్రీను, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, డైరెక్టర్లు, రాయుడు శ్రీను,ఎన్ రవికుమార్, రత్నాకర్, నూకరాజు. ఐ.రవి కుమార్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి బాబా, మహిళ నాయకురాలు పేడాడ రమణి కుమారి, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు,కార్యకర్తలు మహిళలు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.



# ఒంటరిగా పోటీ చేసే సత్తా లేని ప్రతిపక్ష పార్టీలు

**- టార్గెట్ 175 అందరి లక్ష్యం కావాలి**

**- సముద్ర మత్స్య సంపద వెలికితీతలో దేశంలోనే అగ్ర స్థానానికి చేరుకోనున్న ఏపీ**

**- వలంటీర్ల సేవలకు వందనం**

**- ఎంపీ (రాజ్యసభ) విజయసాయి రెడ్డి**




అమరావతి (విజయభాను న్యూస్) : 175 స్థానాల్లో కాదు కనీసం 150 అసెంబ్లీ స్థానాల్లో సొంతంగా పోటీ చేసే సత్తా ప్రతిపక్ష పార్టీలకు లేదని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి అన్నారు. సోషల్ మీడియాలో సోమవారం ఈ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. ఇదే విషయం ప్రస్తావిస్తే ఒంటరిగానో లేక కలిసికట్టుగానో ఎలా పోటీకి దిగాలో చెప్పాల్సిన అవసరమేంటని ప్రతిపక్ష పార్టీ నేతలు ఎదరు ప్రశ్నలు వేస్తున్నారని అన్నారు. ఒంటిరిగా ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించిన వారికి చరిత్రలో స్థానం దొరుకుతుందని ఆయన అన్నారు.

టార్గెట్ 175 అందరి లక్ష్యం కావాలి....

2024 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 175 స్థానాల్లోనూ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడం మనందరి లక్ష్యం కావాలని విజయసాయి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు వైకాపా శ్రేణులు సైనికుల్లా పని చేయాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో శక్తి వంచన లేకుండా శ్రమించాలని కోరారు. సముద్ర మత్స్య సంపద వెలికితీతలో దేశంలోనే అగ్ర స్థానానికి చేరుకోనున్న ఆంధ్రప్రదేశ్... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న 9 ఫిషింగ్ హార్బర్లు, ఫిషింగ్ యూనివర్సిటీ ఏర్పాటుతో సముద్ర మత్స్య సంపద వెలికితీతలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుకోనున్నట్లు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్లు, యూనివర్సిటీ నిర్మాణం కోసం జగన్ ప్రభుత్వం రూ.3800 కోట్లు ఖర్చు చేస్తోందని అన్నారు. వీటికి సంబంధించి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కోల్డ్ స్టోరేజి, ప్రోసెసింగ్ సౌకర్యాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్ల సేవలకు వందనం...

ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న వలంటీర్లకు హ్యాట్సాఫ్ అని విజయసాయి రెడ్డి అన్నారు. ఎవరెంత దుర్మార్గంగా మాట్లాడినా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పగించిన బాద్యతను వలంటీర్లు సైనికుల్లా నిర్వర్తిస్తున్నారని వారి సేవలు అభినందనీయమని, ప్రశంసనీయమని విజయసాయి రెడ్డి అన్నారు.

## 26 రఫేల్, 3 సబ్‌మెరైన్లు.. ఫ్రాన్స్‌తో రూ.90వేల కోట్ల డీల్..?



దిల్లీ: భారత నౌకాదళంలోకి అత్యాధునిక రఫేల్ యుద్ధవిమానాలను చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ విమానాలతోపాటు మూడు స్కార్పెన్ తరగతికి చెందిన జలాంతర్గాముల కొనుగోలుకు సిద్ధమవుతోంది. వీటికి సంబంధించి రక్షణ బలగాలు ఇప్పటికే సదరు శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అయితే ఈ వారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఇందుకు సంబంధించిన ఒప్పంద ప్రకటన వెలువడనున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జులై 13, 14 తేదీల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు.

ప్రతిపాదనల ప్రకారం.. 22 సింగిల్ సీటర్ రఫేల్ మెరైన్ విమానాలతోపాటు నాలుగు శిక్షణా విమానాలు భారత నౌకాదళానికి అందనున్నాయి. ఈ ఒప్పందం విలువ రూ.90వేల కోట్లుగా ఉండవచ్చని అంచనా. కచ్చితమైన విలువ మాత్రం ఒప్పందం పూర్తైన తర్వాతే తెలియనుంది. అయితే, గతంలో 36 రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు సమయంలో అనుసరించిన విధంగా.. ఒప్పందంపై చర్చల కోసం సంయుక్త బృందాన్ని భారత్, ఫ్రాన్స్‌లు ఏర్పాటు చేయనున్నాయని తెలుస్తోంది. ఈ కొనుగోలు ప్రతిపాదనలపై ఇప్పటికే రక్షణశాఖ ఉన్నతాధికారులు చర్చించారని.. మరికొన్ని రోజుల్లోనే రక్షణ పరికరాల కొనుగోలు మండలి ఆమోదం పొందనున్నట్లు సమాచారం.

## నేడు సిబ్బంది వేతనాల కోసం ఆందోళన బాట...

యానాం (విజయభాను న్యూస్) : కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో కోపరేటివ్ స్టోర్స్ లో పనిచేస్తున్న సుమారు85 మంది సిబ్బందికి 30 నెలల నుంచి వేతనాలు అందించకపోవడంతో మంగళవారం నుంచి ఆందోళన బాట పట్టనున్నారు ఈ మేరకు స్థానిక విలేకరులతో సిబ్బంది మాట్లాడుతూ తమకు ప్రభుత్వం అందించవలసిన 30 నెలల బకాయి వేతనాలు అందించాలని పీఎఫ్ ఇపీఎఫ్ ఇఎస్ఐ లు క్రమం తప్పకుండా కట్టాలని మా పిల్లలకు ఫీజులు కట్టక ఇంటికి పంపించేస్తున్నారని మేము ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులను అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోక పోవడంతో ప్రధా నంగా పది డిమాండ్లు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేంతవరకు పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి తమ బకాయి వేతనాలు అందించాలని లేకుంటే రోడ్డున పడే పరిస్థితి ఉందని తెలియజేశారు.

## స్పందన కార్యక్రమంలో 5 అర్జీలు



భీమునిపట్నం విజయభాను న్యూస్ జోన్-1 ,జివిఎంసి జోనల్ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం నకు 5 అర్జీలు వచ్చినట్లు భీమిలి జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి. రాము తెలిపారు. వీటిలోపట్టణ ప్రణాళిక విభాగంనకు-2,ఇంజనీరింగ్ విభాగానికి - 2, ప్రజారోగ్యం విభాగానికి 1 వచ్చినట్లుచెప్పారు. తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతు లకు పంపడం జరిగిందనీ ఆయన అన్నారు.

## స్థాయి సంఘం అభ్యర్థులను నగర మేయర్ సమక్షంలో ప్రకటించిన మంత్రి అమర్నాథ్



విశాఖపట్నం (విజయభాను న్యూస్): మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్థాయి సంఘ సభ్యులను ఎన్నుకునేందుకు అభ్యర్థులను వైయస్సార్ సిపి తరపున ప్రకటించడం జరిగిందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు.

సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు గుడివాడ అమర్నాథ్ వైయస్సార్సీపి తరపున స్టాండింగ్ కమిటీ అభ్యర్థులను ప్రకటించారని తెలిపారు. భీమిలి ఒకటవ వార్డు అక్రమాని పద్మ, తూర్పు 23 వ వార్డు గుడ్ల విజయసాయి, దక్షిణం 29వ వార్డు ఊరుకోటి నారాయణ, 41వ వార్డు కోడిగుడ్లు పూర్ణిమ, ఉత్తరం 47 వార్డు కే. కామేశ్వరి, 54 వార్డు చల్లా రజిని, పడమర 62వ వార్డు బి లక్ష్మణరావు, గాజువాక 73 వార్డు భూపతి రాజు సుజాత, పెందుర్తి 77 వార్డు బి సూర్యకుమారి, అనకాపల్లి 81 వ వార్డు పీలా లక్ష్మీ సౌజన్య లను పార్టీ తరఫున ఎంపిక చేసినట్లు మంత్రివర్యులు ప్రకటించారన్నారు. అనంతరం అభ్యర్థులు జీవీఎంసీ అదనపు కమిషనర్ ను కలిసి నామినేషన్ పత్రాలను అందించారు.

ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## కె.నగరపాలెంలో ఘనంగా శ్రీ ముత్యాలమ్మతల్లి పండగ

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : జీ వి ఎం సీ భీమిలీ జోన్ నాలుగవ వార్డ్ కె.నగరపాలెం లో ముత్యాలమ్మ తల్లి అమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తొత్తడి సూరిబాబు దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు . అనంతరం...

విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు,మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి,ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్సీ రఘువర్మ, భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కోరాడ రాజబాబు,ఉత్తర నియోజకవర్గం ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు,నగరాల రాష్ట్ర చైర్మన్ పిల్ల సుజాత సత్యనారాయణ,దిశ ఏసిపి సి.హెచ్ వివేకానంద్,భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, 2,3,4,7,98 కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి అప్పలనాయుడు, గంటా అప్పలకొండ నూకరాజు, దౌలపల్లి కొండబాబు, పాసి నరసింగరావు మరియు గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



భీమునిపట్నం : విజయ భాను న్యూస్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 74 సంవత్సరాల పూర్తి చేసుకుని నేటికి 75వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా భీమిలి బీచ్ లో భీమిలీ శాఖ ఆధ్వర్యంలో బీచ్ లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు రాష్ట్ర. ఏ బి వి పి ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ లోడగల అచ్చిబాబు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతు,విద్యార్థి సమస్యల పరిష్కారంకై పనిచేస్తూ, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువత యువకుల్లో,దేశభక్తిని పెంపొందిస్తూ, దేశం జాతీయ పునర్నిర్మాణం కోసం పని చేస్తున్న అతిపెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బుత్తల వంశీ, సుశాంత్,ప్రవీణ్, చక్రి, అరవింద్, రాజేష్, ఈశ్వర్, ఉద్దేశ్, నాగరాజు,శ్రీను,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన అదినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు కు నిరసన తెలిపిన వాలంటీర్లు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా పైసా అవినీతి కి తావు లేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ గడప గడపకు వెళ్ళి పాలన అందించాలని ప్రతీ 50 ఇళ్ళు కు ఒక వాలంటీర్ ను నియమించి వాలంటీర్ వ్యవస్థ పెట్టి కరోనా సమయం లో కూడా ఒకరిని ఒకరు ముట్టుకునే పరిస్థితి లేని రోజుల్లో కూడా వైసిపి ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు నిబద్దత తో సేవలు అందించారు ఒకప్పుడు ఏదైనా పని కావాలన్నా సర్టిఫికెట్ కావాలన్నా ఏపని కావాలన్నా ప్రభుత్వ అధికారులు కార్యాలయాలు చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగే పరిస్థితి ఉండేది అలాంటిది నేరుగా వారింటికి వెళ్లి పథకాలు అందిస్తున్న సేవలకులు వాలంటీర్లు అలాంటి వారిపై ఎలాంటి ఆధారాలు లేకుండా తన నోటికి ఏది వస్తే అది మాట్లాడి వాలంటీర్లు మనోభావాలు దెబ్బతినే విధంగా ఒంటరి మహిళలు, వితంతువులు వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు వాలంటీర్లు సమాచారం అందిస్తున్నారని నిందలు మోపడం ఎంత వరకూ సమజసమో ఆయన విజ్ఞతకే తెలియాలి ఆయనలా 6 నెలలకు ఒకసారి బయటకు వచ్చి మైకు ముందు నాలుగు అరుపులు మూడు కేకలు వేసి మరల ఇంటికి పరిమితం అయ్యేటటవంటి పరిస్థితి మా వాలంటీర్లు ది కాదని కేవలం 5 వేలు రూ గౌరవ వేతనం తీసుకుంటూ సేవలు అందిస్తున్నాం మాపై లేనిపోని ఆరోపణలు అనుచిత వ్యాఖ్యలు పై తీవ్రంగా ఖండిస్తున్నాం ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు కు బహిరంగ క్షమాపణలు చెప్పి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేదంటే రాష్ట్రంలో ఉన్న వాలంటీర్లు అంతా ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరిస్తూ పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ ధగ్ధం చేసి భీమిలి నియోజకవర్గం అన్ని చోట్లా నిరసన కార్యక్రమాలు చేశారు

అనంతరం పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు గానూ వాలంటీర్లు పోలీస్ స్టేషన్ లలో ఆయనపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమం లో నియోజకవర్గం లో వాలంటీర్ల పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో గృహ సంపర్క్ అభియాన్ బిజేపి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ

ఆనందపురం. విజయభాను న్యూస్ : మండలంలో 8 ,9 తేదీ లలో రెండు రోజులు ముకుందపురం,రేగాని గూడెం, గ్రామంలో బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 9 సంవత్సరముల సంక్షేమం సుపరిపాలనలో ప్రజలకు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు కరపత్ర లా ద్వారా ప్రతి ఒక్కరికి ప్రతి ఇంటికి గృహ సంపర్క్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనందపురం మండలం లో గత నెల రోజులుగా, మండలంలో 10 పంచాయతీలు పర్యటించడం జరిగిందని,గ్రామీణ ప్రాంత ప్రజల్లో బిజెపి పార్టీ కి మంచి ఆదరణ ఉందని,దానికి కారణం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన,ఈ-శ్రమ్ కార్డులు ద్వారా, అసంఘిక కార్మికుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ ద్వారా రక్షణ కల్పించడం.కేంద్ర ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలు అమలు జరిపి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను ఆదుకుంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ%శీ%మే మరల 2024 లో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత మన అందరి పైన ఉందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 9 సంవత్సరాల పరిపాలన 9090902024 నెంబర్ కి మిస్డ్ కాల్స్ ద్వారా మద్దతు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల ఉపాధ్యక్షులు కర్రోతు సత్యనారయణ కిసాన్ మోర్చా నాయకులు బంక సీతం నాయుడు, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు గొర్లి వాని పాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## నాయకులు కార్యకర్తలకు వైసీపీ అధ్యక్షులు కోన పిలుపు



పరవాడ, విజయభాను న్యూస్ : నేడు ఉదయం 9:00 గంటలకు పరవాడ మండలం గొర్లివాని పాలెం గ్రామం సచివాలయంలో మన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమా నికి ముఖ్య అతిథిలు గా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ , పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు , పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొని , దీని లో భాగంగా 11 రకాల సేవలు యూజర్ ఛార్జి లు లేకుండా ఉచితంగా కుల,ఆదాయ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు, కొత్త రేషన్ కార్డ్, హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ అనేక సేవలలో దరికస్తూ చేసుకున్న దరికాస్తుదారులకు అందరికి గౌరవ ఎమ్మెల్యే అదీప్ రాజ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు ను అందచెయ్యనున్నారు అని వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు పేర్కొన్నారు . కావున మండల లో గల వైస్ ఎం.పి.పి లు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, జే సి ఎస్ కన్వీనర్ లు, గృహ సారథులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, వై.సి.పి ముఖ్య నాయకులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు..

## జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్స్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు ను తీవ్రంగా ఖండిస్తున్న బీసీ విభాగం అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గత రాత్రి ఏలూరు బహిరంగ సభలో వాలంటీర్స్ పై అనుచిత వ్యాఖ్యలు చేసారని ఆడపిల్లలు ఎవరిని ప్రేమిస్తున్నారని, వితంతువులు వున్నారా అని సమాచారం సేకరించి సంఘ విద్రోహ శక్తులకు చేరవేస్తున్నారని అలాంటి వ్యాఖ్యలు చేసి ఇంకా రోజు రోజుకి దిగజారిపోతున్నారని మన్యాల శ్రీనివాస్ పేర్కొన్నారు..,

వాలంటీర్స్ నిస్వార్ధంగా ప్రజలకు సేవా చేయాలనీ స్వచ్ఛందంగా రూ 5000/- గౌరవ వేతనంగా తీసుకుంటు తమ అమూల్యమైన సేవలను అందిస్తున్న వారి సేవలను కించపరుస్తూ మాట్లాడటం చుస్తే నీ రాజకీయ పరిజ్ఞానం అర్ధం అవుతుంది అని నీకు రాజకీయాల్లో దత్త తండ్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదవడమే పనిగా పెట్టుకుని రాజీకీయాలు చేస్తే ప్రజలు నిన్ను ఎప్పటికి ఎన్నుకోరు అని వ్యాఖ్యనించారు...,

కరోనా వంటి విపత్కర సమయంలో నువ్వు నీ దత్త తండ్రి హైదరాబాద్ లో తల దాచుకున్నప్పుడు ఈ వాలంటీర్స్ మాత్రమే ప్రజలకు సేవలు అందించారాని కరోనా మహమ్మారి ప్రజలను చావు అంచుల వరకు తీసుకెళ్లిన సమయం లో వాలంటీర్స్ మాత్రమే మృత్యువు తో సైతం పోరాడి ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడారూ..,

దేశంలో చాలా రాష్ట్రాలు వాలంటీర్స్ సేవలను అభినందిస్తు వారి రాష్ట్రాల్లో గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ వ్యవస్థ ను స్థాపించడానికి ముందుకి వస్తుంటే నువ్వు నీ దత్త తండ్రి ఇంత అక్కసు వెళ్ళగక్కుతున్నారు అని మన్యాల శ్రీనివాస్ మండిపడ్డారు ప్రతి నెల 1వ తారీకు పొద్దు పొడవకే ముందే ప్రతి ఇంటి గడప తట్టి అవ్వ,తాతలకు,వృద్దులకు, వితంతువులకు పెన్షన్ తీసుకుంటున్న మరియు ప్రభుత్వం నుండి వస్తున్న సంక్షేమ ఫలాలను తీసు కుంటున్న ఎవరిని అడిగిన చెప్తారు పవన్ కళ్యాణ్ వాలంటీర్స్ సేవల కోసం అలాంటి నువ్వు ఈరోజు ప్రభుత్వం కోసం దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు,క నీసం వార్డు మెంబెర్ కూడా గెలవలేని నీకు కేంద్ర నిఘా వర్గాలు సమాచారం ఇచ్చింది అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని ఇంకొకసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు అని కచ్చితంగా ప్రభుత్వం మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నుండి తీవ్రమైన పరిణామాలు ఎదురు కుంటారని హెచ్చరించారు.

## ప్రపంచ పారా బాడ్మేయింటన్ పోటీల్లో సిల్వర్ మెడల్స్ సాధించిన రూపవతి



రాజాం (విజయభాను న్యూస్) : ఉగాండా దేశం లో ప్రపంచ దివ్యంగుల బాడ్మేయింటన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా ఎచెర్ల నియోజకవర్గం జి. సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన పడాల. రూపవతి మూడు సిల్వర్ మెడల్స్ సాధించింది. సంకల్పం చెదారనీయకుండా సింగిల్స్, డబల్స్ అండ్ మిక్సడ్ డబల్స్ మూడు విభాగల్లో తన సత్తా చాటి మూడు సిల్వర్ మెడల్స్ సాధించి స్వగ్రామానికి పేరుతీసుకొచ్చింది. ఈమె రాజాంలో ఎస్ఎల్ టీఎన్ కళాశాలలో డిగ్రీ చదువుకుంది. భారతదేశం కే మంచి పేరు తీసుకువచ్చిన ఈమెను కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు సంతవురిటి గ్రామస్తులు అభినందించారు.

## సొసైటీల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

దేవరాపల్లి, విజయభాను న్యూస్ : సొసైటీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకటరావు అన్నారు. త్యాజంపూడి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నూతన పెట్రోల్ బంక్ని ప్రారంభించారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా అందిస్తున్న సబ్సిడీలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియపరిచి ఆ సేవలను వినియోగించుకునేలా సిబ్బంది పనిచేయాలని ఎంఎల్ఎ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గన్నమణి వెంకటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ గన్నమనేని జనార్ధన్‌రావు, కూచిపూడి సతీష్, కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్, నాయకులు పాల్గొన్నారు.

# పుదుచ్చేరి ఎంపీ వైద్యులింగంతో మల్లాడి సత్తిబాబు భేటీ

**- నియోజకవర్గ పలు సమస్యలపై చర్చించిన బీసీ సేన ప్రధాన కార్యదర్శి సత్తిబాబు**

**- అతి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం**





యానాం, విజయభాను న్యూస్ : యానం కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి రాజధానిలో కాంగ్రెస్ ఎంపీ, ప్రస్తుత పుదుచ్చేరి పిసిసి చీఫ్ తోసమావేశమైన ఆంధ్రప్రదేశ్ బీసీ సేన ప్రధాన కార్యదర్శి, యానం సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లాడి సత్తిబాబు వైద్య లింగంతో సమావేశమయ్యారు. యానంకు సంబంధించి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిలిచి పోయాయని వెలువెంటనే రాష్ట్ర సీఎంతోను, మంత నాలు జరిపి అభివృద్ధి జరిగేలా చూడాలని మల్లాడి సత్తిబాబు కోరారు.

1.చుమురు సంస్థలు నుండి 100 కోట్లు నిధులను సేకరించి, కేంద్రం సహాయంతో అర్హులైన పేద ప్రజలకు పదివేల ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని, అదేవిధంగా మత్స్యకారులకు చమురు సంస్థల నుండి ఎటువంటి, ఎంక్వయిరీలు లేకుండా, వెంటనే ఆంధ్ర మాదిరిగా మత్స్యకారులకు వేట నష్టపరిహారాన్ని అందించాలని ఆయన కోరారు.

2.కోవిటి సమయంలో విశేష సేవలు అందించిన నర్సులను విధులను కొనసాగించేలా కృషి చేయాలని ఎంపీ వైద్యులింగం నువిజ్ఞప్తి చేశారు. ప్రజా అభీష్టం మేరకు డంపింగ్ యార్డ్ మరోచోటకి మార్పు చేసేలా చొరవ చూపాలని సత్తిబాబు కోరారు.

3.సావిత్రి నగర్ నుండి యానం ఏటిగట్టు మీదుగా రాజోలు, రావులపాలెం వరకు రోడ్లను విస్తరించి పర్యటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని సత్తిబాబు ఎంపీ వైద్యులింగాన్ని కోరారు.

4.ఎంపీ వైద్యలింగం పిలుపుమేరకు అతి త్వరలో యానం నుండి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉందని, అన్నీ కలిసి వస్తే త్వరలో పార్టీలో చేరతామని మల్లాడి సత్తిబాబు మీడియాకు తెలిపారు.

5.తదనాంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీని త్వరలో కలుస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయాన్ని ప్రకటించాలని ఎంపీ వైజలింగాన్ని విజ్ఞప్తి చేశారు.

6.ఎంపీ వైద్యలింగం పిలుపుమేరకు... అతి త్వరలో యానం నుండి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉందని, అన్నీ కలిసి వస్తే త్వరలో పార్టీలో చేరతామని మల్లాడి సత్తిబాబు మీడియాకు తెలిపారు. తదన 7.అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీని త్వరలో కలుస్తామని తెలిపారు.

### జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో

# సేవా రత్న అవార్డులు ప్రదానం



కాకినాడ (విజయభాను న్యూస్): కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న రైజ్ (రెడీనెస్ ఇనీషియేటివ్ ఫర్ సిచువేషనల్ ఇంగ్లీష్) ద్వారా జీవీ ప్రసాద్ జిల్లా కోర్సు కోఆర్డినేటర్ గా అందిస్తున్న సేవలకు అరుదైన గౌరవం దక్కింది. కళామందిర్ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం జరిగిన ఉత్సవంలో సేవ రత్న అవార్డులను ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాలలో విశేష సేవలందింస్తూ పెద్దగా గుర్తింపునకు నోచుకోలేని అన్ సీన్ హీరోస్ ను ఐదుగురుని కళామందిర్ ఫౌండేషన్ వారు సేవారత్న అవార్డులు ఇచ్చి సత్కరించారు. దీనిలో భాగంగా ఆ ఫౌండేషన్ సెలక్షన్ కమిటీ కాకినాడ జిల్లాలో పేద తెలుగు విద్యార్థుల మధ్య అమెరికా తరహా ఇంగ్లీషు విద్యను అందిస్తున్న రైజ్ జిల్లా కోర్స్ కోఆర్డినేటర్ యైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పి.దొంతమూరు లో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పని చేయుచున్న బెండపూడి ప్రసాద్ నుఎంపిక చేసింది తెలంగాణ రాష్ట్రం నుండి నలుగురు ఆంధ్ర ప్రదేశ్ నుండి జీవీ ప్రసాద్ గారు ఈ సేవా రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. శుక్రవారం 7/ 7/ 2023 సాయంత్రం ఏడు గంటలకు ప్రధాన్ కన్వెన్షన్, గచ్చిబౌలి, హైదరాబాద్ నందు ఎందరో తెలంగాణ రాష్ట్ర నాయకులు సినీ ప్రముఖులు అతిరథ మహారథుల సమక్షంలో కార్యక్రమం జరిగింది. కాకినాడ జిల్లా నుండి జీవీ ప్రసాద్ ను దుస్సాలువ, మెమెంటో, 50 వేలు నగదు బహుమతితో కళామందిర్ ఫౌండే షన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, డిఈఓ అన్నపూర్ణ జీవి ప్రసాద్ ను సోమవారం గ్రీవెన్స్ లో అభినందించారు.

# ఘనంగా జరిగిన వాసవి కళ్యాణ మండప సంఘం 52వ వార్షికోత్సవం




విశాఖపట్నం, విజయభాను న్యూస్ : నగరంలో వన్ టౌన్ ప్రాంతంలో వుడ్ యార్డ్ స్ట్రీట్ లో గల వాసవి కళ్యాణ మండప సంఘం 52వ వార్షికోత్సవం ఆదివారం నాడు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేసిన కంకటాల మల్లిక్ మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా ఆర్యవైశ్యులుకు సేవలందిస్తున్న కళ్యాణమండపం సంఘం ఎంతైనా అభినందనీయమని అన్నారు. ఆధునికతకు తగ్గట్టుగా కళ్యాణ మండపాన్ని ఆధునీకరించినందుకు కార్యవర్గాన్ని మరియు ఆర్థికంగా విరాళాలు అందించిన దాతలను అభినందించారు. వాసవి కళ్యాణ మండప సంఘం అధ్యక్షులు విన్నకోట రామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ప్రారంభ ఉపన్యాసంలో మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం 1971 వ సంవత్సరంలో అప్పటి పరిస్థితులలో నగరంలో దిగువ మరియు మధ్యతరగతి ఆర్యవైశ్యుల కుటుంబాలలో శుభకార్యముల నిర్వహించుటకు అణువుగా వాసవి కళ్యాణ మండప సంఘం స్వర్గీయ అద్దేపల్లి నరసింహారావు వ్యవస్థాపక అధ్యక్షతన ఏర్పాటు అయిందని తదనంతర కాలంలో వుడ్ యార్డ్ స్ట్రీట్ లో దివంగత వంకాయల లక్ష్మీకాంతమ్మ విరాళంగా నొసంగిన స్థలంలో ప్రస్తుత కళ్యాణమండపాన్ని నిర్మించి దశలవారీగా అభివృద్ధి చేసి అధునాతన సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ మహత్కార్యంలో విరాళములు అందించి పాలుపంచుకున్న దాతలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి కందుల మూర్తి మాట్లాడుతూ వాసవి కళ్యాణ మండప సంఘం ఆర్యవైశ్యుల కుటుంబాలలో పెళ్లిళ్లు, శుభకార్యములు నిర్వహించు కొనుటకు నామమాత్రపు రుసుముతో అందించాలనే ఉద్దేశంతో ప్రారంభమైనప్పటికీ ఇతర కులస్తులకు కూడా కళ్యాణ మండపం అందుబాటు ధరలకు ఇస్తున్నట్లు తెలిపారు. కేవలం కళ్యాణ మండపం నిర్వహించడమే కాకుండా నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలలో యువతీ యువకులకు సామూహిక వివాహాలు ఉచితంగా ఫలుదాఫాలు నిర్వహించినట్లు తెలిపారు. సమాజ సేవలో భాగంగా కరోనా విపత్తు సమయంలో అన్నార్తులకు, అభాగ్యులకు, పారిశుధ్య కార్మికులకు, అహోరాత్రులు శ్రమిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న పోలీసు సిబ్బందికి పలుమార్లు భోజనాలు/టిఫిన్స్ ఆర్యవైశ్యుల విరాళాలతో అందించామన్నారు. 52వ వార్షికోత్సవ కమిటీ చైర్మన్ పట్నాల వెంకటరెడ్డి మాట్లాడుతూ సంఘ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం సుమారు 300 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

తదుపరి గత ఐదు దశాబ్దాల నుంచి కళ్యాణ మండపం సంఘానికి ఇతోదికంగా విరాళాల అందిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడిన దాతలుని ఘనంగా సన్మానించి గౌలవించారని తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధికి తమ సేవలు అందించి స్వర్గస్తులైన మాజీ అధ్యక్ష, కార్యదర్శి కోశాధికారుల సేవలను కొనియాడుతూ జీవించి ఉన్న మాజీ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులను ఘనంగా సత్కరించారని తెలిపారు. కార్యక్రమంలో వాసవి కళ్యాణ మండప సంఘం అధ్యక్షులు మామిడి వీరభద్ర రావు, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు నల్లూరి నూకరాజు, పూసర్ల సురేష్ కుమార్, గ్రంధి దుర్గాప్రసాద్, కన్యకా పరమేశ్వరి దేవస్థాన సంఘం ప్రతినిధులు గ్రంధి రామకృష్ణారావు, ఆరిశెట్టి దినకర్, సుగ్గు శివకుమార్ మరియు అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులుకు సర్టిఫికెట్ లు పంపిణీ



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : ఆదర్శ హిందీ ప్రేమీమండలి తరపున విద్యార్థులుకు చేస్తున్న సేవలు ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు, గంటా నూకరాజు అన్నారు.సోమవారం ఆదర్శ హిందీ ప్రేమీమండలి భీమిలి శాఖ కార్యాలయంలో హిందీ ప్రాథమిక, మాధ్యమిక పరీక్షల విభాగాల్లో ఉత్తీర్ణులైన 26 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి శాఖ ఆదర్శ్ హిందీ ప్రేమీమండలి ద్వారా విద్యార్థులకు హిందీలో మంచి తర్ఫీదును ఇస్తున్నారని ఇలాంటి శాఖ భీమిలిలో ఉన్నందుకు విద్యార్థులు అదృష్టమనీ తెలిపారు. ఆదర్శ హిందీ ప్రేమీమండలి వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణారావు మాస్టర్ మాట్లాడుతూ హిందీపట్ల విద్యార్థుల్లో ఒక అవగాహన ఉందని, రోజురోజుకు విద్యార్థులు పెరగడమే దీనికి నిదర్శనమని అన్నారు. మొన్న జరిగిన వేసవి శిబిరంలో కూడా ఎక్కువ మంది విద్యార్డులు హాజరయ్యారని ఈ అవకాశంను అందరూ వినియోగించుకోవాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి బొత్సకు పలువురి శుభాకాంక్షలు



బొత్సకు అభినందనలు తెలుపుతున్న ఎమ్ఎల్ఏ కంబాల జోగులు తదితరులు

రాజాం (విజయభాను న్యూస్) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణను రాజాం ప్రాంతానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు జన్మదినం సందర్భంగా అభినందించారు. ఆదివారం విజయనగరంలోని ఆయన నివాసానికి చేరుకుని పుష్పగుచ్చాలు అందించారు. రాజాం ఎమ్ఎల్ఏ కంబాల జోగులు, ఎమ్ఎల్సీ పాలవలస విక్రాంత్, పాలకొండ ఎమ్ఎల్ఏ విశ్వసరాయి కళావతి, శ్రీకాకుళం జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు, రాజాం ఏఎమ్ సీ మాజీ చైర్మన్ సిరిపురపు కుమారస్వామినాయుడు, రాజాం వైఎస్ఆర్ సీపీ నాయ కులు పాలవలస శ్రీనివాస రావు, లావేటి రాజగోపాల నాయుడు, పొట్నూరు లక్ష్మణరావు తదితరులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.



బొత్సకు అభినందనలు తెలుపుతున్న కుమారస్వామినాయుడు తదితరులు.

# సంఘీభావ పాదయాత్రకు తరలి రండి

### నాయకులు కార్యకర్తలకు

### టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వియ్యపు పిలుపు



పరవాడ (విజయభాను న్యూస్) : జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రివర్యులు నారా లోకేష్ యువగలం పాదయాత్రపాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసిన సందర్బంగా నేడు సాయంత్రం 4 గంటలకుచిన ముసిడివాడ జంక్షన్ ఆంజనేయు స్వామి గుడినుంచి పెందుర్తి జంక్షన్ వరకు మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సంఘీబావ పాదయాత్ర చేయుచున్నారు అని మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న పేర్కొన్నారు.. ఈ కార్యక్రమానికి విధిగా నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణ మూర్తి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సందర్భంగా వియ్యపు చిన్న కోరారు..

### డిజిటల్ శిక్షణతో

# మెరుగైన విద్య



రాజాం (విజయభాను న్యూస్) : డిజిటల్ శిక్షణతో మెరుగైన విద్య విద్యార్థులకు అందించగలమని డిజిటల్ బోధన కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, అన్నారు.

సోమవారం రాజాం జీఎంఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ బోర్డుల వినియోగం పై జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెసిలిటేటర్స్ కుమారాపు చంద్రునాయుడు, సీహెచ్.ప్రసాద్ లు,శిక్షకులు సతీష్ ,రవికిషోర్ లు. కోర్సు అదనపు డైరెక్టర్ గంగునాయుడు, సీతంపేట, వీం ఘట్టం, రాజాం, జీయంవస ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్పందన సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



రాజాం (విజయభాను న్యూస్) : స్పందన సమస్యలు సకాలంలో పరిష్కరించేలా అన్నిశాఖల అధికారులు దృష్టిసారించాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు అధికారులకు సూచించారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. ప్రతీ సచివాలయం వద్ద జగనన్నకు చెబుదాం సమస్యలు పరిష్కరించే బోర్డులు ఉండాలని తెలిపారు.

# హైద్రాబాద్‌లో 'గుంటూరు కారం'



మహేష్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రంలో తాజాగా హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సెట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రీకరణలో మహేశ్‌తో పాటు ఇతర ప్రధాన తారాగణంపై ఓ ఫైట్‌ను తెరకెక్కించనున్నారు. దీని కోసం మహేశ్ ఇప్పటికే ప్రత్యేకంగా సిద్ధమైనట్లు సమాచారం. టైటిల్‌కు తగ్గట్లుగానే గుంటూరు నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ చిత్రమిది. ఎస్.రాధాకృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 13న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.


# 'జైలర్' నుంచి 'నువ్వు కావాలయ్యా..' పాట విడుదల



సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్'. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'నువ్వు కావాలయ్యా'పాటని విడుదల చేశారు మేకర్స్. స్టార్ కంపోజర్ అనిరుధ్ ఈ పాటని క్యాచి బీట్స్ తో ఇన్స్టంట్ చార్ట్ బస్టర్ నెంబర్ గా స్వరపరిచారు. అరుణ్‌రాజా కామరాజ్ రాసిన ఈ పాటను శిల్పారావు, అనిరుధ్ కలసి ఎనర్జిటిక్ గా పాడారు.ఈ పాటలో సూపర్ స్టార్ రజనీకాంత్ స్వాగ్, గ్రేస్ మెస్మరైజ్ చేయగా, తమన్నా డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ రమ్య కృష్ణన్, తమన్నా తో పాటు వసంత్ రవి, నాగ బాబు, యోగి బాబు, జాఫర్ సాదిక్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.టాప్ టెక్నికల్ టీం ఈ చిత్రానికి పని చేస్తోంది. విజయ్ కార్తిక్ కన్నన్ కెమెరామెన్ గా పనిచేస్తుండగా ఆర్ నిర్మల్ ఎడిటర్ గా చేస్తున్నారు. డిఆర్ కే కిరణ్ ఆర్ట్ డైరెక్టర్ కాగ, స్టన్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.జైలర్ ఆగస్టు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తారాగణం: రజనీకాంత్, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, శివ రాజ్‌కుమార్, సునీల్, రమ్య కృష్ణన్, వినాయకన్, మర్నా మీనన్, తమన్నా, వసంత్ రవి, నాగ బాబు, యోగి బాబు, జాఫర్ సాదిక్, కిషోర్, బిల్లీ మురళీ, సుగుంతన్, కరాటే కార్తీ, మిథున్, అర్షద్, మారిముత్తు , రిత్విక్, శరవణన్, అరంతంగి నిషా, మహానంది శంకర్ తదితరులు

# రష్మిక పై ప్రశ్న..

## ఆన్సర్ చెప్పనన్న ఆనంద్ దేవరకొండ



నటి రష్మిక నటుడు విజయ్ దేవరకొండ రిలేషన్‌లో ఉన్నారంటూ ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రష్మిక గురించి ఆనంద్ (విజయ్ దేవరకొండ సోదరుడు)ను ప్రశ్నించగా ఆయన అసహనం వ్యక్తం చేశారు.

హైదరాబాద్: నటి రష్మిక గురించి అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి అనాసక్తి కనబరిచారు నటుడు ఆనంద్ దేవరకొండ (%ూఱఖఱఅ ఐవజవతీఖనశీఱఖ%). తాను ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాలనుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇంతకీ రష్మిక గురించి విలేకరి అడిగిన ప్రశ్న ఏమిటంటే..?

తన తదుపరి చిత్రం 'బేబీ' ప్రమోషన్స్‌లో భాగంగా ఆనంద్ దేవరకొండ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. విలేకరి అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెబుతూ.. కథ తనకెంతో నచ్చిందని, ఇది తప్పకుండా తన కెరీర్‌కు మంచి విజయాన్ని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, విలేకరి.. "మీ సినిమాలోని ఓ సాంగ్‌ను రష్మిక రిలీజ్ చేశారు కదా. ఆ సాంగ్ ఈవెంట్‌కి వచ్చిన వాళ్లందరూ ఆమెను 'వదినా' అని గట్టిగా పిలిచారు కదా.." అని అడగ్గా.. ఆనంద్ అసహనం కనబరిచారు. "నో. నేను దీన్ని ఇక్కడితో ఆపేస్తాను" అని బదులిచ్చారు.

ఇదే ఇంటర్వ్యూలో తమ సినిమా పోస్టర్ డిలీట్ చేయడంపై మాట్లాడుతూ.. "సినిమా టీజర్, ట్రైలర్, మ్యూజిక్‌కు ఎంతటి ఆదరణ లభించిందో అదేవిధంగా పోస్టర్లకూ మంచి టాక్ వచ్చింది. సినీ ప్రియులు ఎంతగానో మా పోస్టర్లను ఇష్టపడ్డారు. అయితే, రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ చేస్తూ మేము ఒక పోస్టర్ రిలీజ్ చేశాం. దానికి మిశ్రమ స్పందనలు వచ్చాయి. కొంతమంది 'ఇదేం పోస్టర్' అని కామెంట్ చేశారు. నెగెటివ్‌గా ఉందన్నారు. దాంతో వెంటనే దాన్ని డిలీట్ చేసేశాం" అని చెప్పారు.

# త్వరలో విజయ్ కొత్త చిత్రం ప్రారంభం



'గీత గోవిందం' తర్వాత విజయ్ దేవరకొండ, పరుశురామ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రాబోతోంది. దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాకి నిర్మాతలుగా వ్యవహరించబోతున్నారు. మృణాళ్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించనున్న ఈ చిత్రానికి సంబంధించి తాజా అప్‌డేట్ బయటికి వచ్చింది. త్వరలోనే షూటింగ్ ప్రారంభించబోతోన్నామని నిర్మాణ సంస్థ ప్రకటించింది. 'వీడీ13, ఎస్‌వీసీ54' చిత్రానికి సంబంధించిన లకేషన్ రెక్కీ అమెరికాలో పూర్తయింది అంటూ టీమ్‌తో ఉన్న ఓ ఫొటోను మేకర్స్ షేర్ చేశారు. దిల్ రాజు, పరుశురామ్ ఇతర సాంకేతిక నిపుణులు ఆ ఫొటోలో కనిపిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 54వ చిత్రంగా ఈ చిత్రం తెరకెక్కబోతోంది.

# మై డియర్ మార్కండేయ..




సాయి ధరమ్ తేజ్ హీరోగా పవన్ కళ్యాణ్ గెస్ట్ రోల్‌లో నటించిన 'బ్రో ది అవతార్' చిత్రం నుండి తాజాగా ఫస్ట్ సాంగ్ విడుదలైంది. సముద్రఖని దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా నుంచి 'మై డియర్ మార్కండేయ' అంటూ సాయి ధరమ్ తేజ్, పవన్ లపై డిజైన్ చేసిన ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటలో ఊర్వశి రౌతేలా కూడా కనిపిస్తున్నారు. థమన్ అందిస్తున్న ఈ చిత్రానికి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణం వహిస్తోంది. ఈ నెల 28న ఈ సినిమా రిలీజ్ కానుంది.

# నా సినిమాకు నేనే హీరో..



'నా కెరీర్‌లో దుల్కర్ సల్మాన్, ధనుష్, విజయ్ సేతుపతి, శివ కార్తికేయన్ తప్ప మిగతా హీరోలు అవకాశాలు ఇవ్వలేదు. ఎందుకో నాకు అర్థం కాలేదు. స్టార్ హీరోలు కూడా ఒక హీరోయిన్‌కు అవకాశం ఇవ్వాలంటే.. ఆమె మార్కెట్, ఓటీటీ, డిజిటల్, శాటిలైట్ రైట్స్ ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. మనం కోరుకున్న స్థాయికి ఎదగాలంటే దేనికైనా సిద్ధంగా ఉండాలి. అందుకే నేను లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తున్నాను. నా సినిమాకు నేనే హీరో.. నేనే హీరోయిన్. ఇప్పటి వరకు 15 కి పైగా సినిమాలు తీశాను నాకంటూ అభిమానులు ఉన్నారు. వాళ్లే నన్ను ఆదరిస్తారు' అంటున్నారు ఐశ్వర్య రాజేష్. తెలుగు గడ్డమీదే పుట్టిన ఈమెకు టాలీవుడ్‌లో అవకాశాలు లేక కోలీవుడ్‌లో నటిస్తూ మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎక్కువగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తున్న ఐశ్వర్య తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పై విషయాలపై స్పందించారు.

# 'ఆ దర్శకుడు.. నన్ను శారీ పిన్ తీసేయమన్నాడు' – సీనియర్ నటి షాకింగ్ కామెంట్స్



ఒకప్పుడు సినీ ప్రియుల అభిమానం పొందిన నటి డ్రీమ్‌గర్ల్ హేమ మాలిని . తన సినీ కెరీర్‌కు సంబంధించిన ఓ సంఘటనపై తాజాగా ఆమె మాట్లాడారు.

సీనియర్ నటి, లోక్‌సభ సభ్యురాలు హేమమాలిని షాకింగ్ కామెంట్స్ చేశారు. గతంలో ఓ సినీ దర్శకుడి మాటల వల్ల తాను ఇబ్బందిపడ్డానని అన్నారు. చీర పిన్ తీసేయమంటూ.. సెట్‌లో అందరి ముందు ఆయన అన్న మాటలు విని తాను షాక్ అయ్యానని ఇటీవల చెప్పారు.

సినీ పరిశ్రమ నుంచి దూరమై.. ప్రస్తుతం రాజకీయాల్లో కొనసాగుతోన్న హేమ మాలిని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సినీ కెరీర్, ధర్మేంద్రతో వివాహం, పిల్లలు వంటి ఆసక్తికర విషయాలపై ఆమె మాట్లాడారు. ఇందులో భాగంగా, నటిగా ఉన్నప్పుడు తనకు ఎదురైన ఓ సంఘటన గురించి స్పందిస్తూ..

"ఓ సినిమా సెట్‌లో చోటుచేసుకున్న ఈ విషయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆ దర్శకుడు నాపై ఒకరకమైన సన్నివేశాలు చిత్రీకరించాలనుకున్నాడు. సాధారణంగా నాకు చీర పైటకు పిన్ను పెట్టుకునే అలవాటు ఉంది. అయితే, ఆ సీన్‌కు వద్దని చెప్పడంతో.. 'పిన్ను తీసేస్తే చీర జారిపోతుంది' అని బదులిచ్చాను. దానికి ఆయన నాకు కావాల్సిందే అదే అన్నాడు. ఆయన మాటలకు నేను కంగారుపడ్డా" అని ఆమె వివరించారు. 'సత్యం శివం సుదరం' సినిమా ఆఫర్ మొదట తనకే వచ్చిందని, కాకపోతే తాను రిజెక్ట్ చేశానని చెప్పారు.అనంతరం ధర్మేంద్ర గురించి మాట్లాడుతూ.. తమ కుమార్తెల(ఇషా, అహనా)ను ఆయన సంరక్షిస్తుంటారని అన్నారు. కుమార్తెల పెళ్లి విషయంలో ఆయన ఎప్పుడూ కంగారుపడుతూ ఉండేవారని చెప్పారు. ఇక, 'షోలే', 'సీత ఔర్ గీత' తదితర చిత్రాల్లో హేమ-ధర్మేంద్ర కలిసి నటించారు. ఆ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. 1980లో వివాహం చేసుకున్నారు. అయితే అప్పటికే ధర్మేంద్రకు వివాహమైన విషయం తెలిసిందే.

# వెకేషన్‌కు మెగాస్టార్ దంపతులు..

## సోషల్ మీడియాలో పోస్ట్!



మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రానికి మెహర్ రమేశ్ దర్శకత్వంలో తెరకెక్కిం చారు. ఈ మూవీలో మెగాస్టార్ సరసన మిల్కీ బ్యూటీ తమన్నా కనిపించనుంది. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో బిజీగా ఉంది. అంతే కాకుండా చిరంజీవి తన పాత్ర డబ్బింగ్‌ని పూర్తి చేశారు. దీనికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ చిత్రాన్ని తమిళంలో సూపర్ హిట్ అయిన వేదాళం రీమేక్‌గా తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ షెడ్యూల్ పూర్తి కావడంతో మెగాస్టార్ విదేశాలకు పయనమయ్యారు.వెకేషన్‌కు అమెరికా వెళ్తున్నట్లు మెగాస్టార్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా సతీమణితో విమానంలో దిగిన ఫోటోలను షేర్ చేశారు. షూటింగ్‌లతో ఎప్పుడు బిజీగా ఉండే చిరంజీవి.. కాస్తా తీరిక సమయం లభిస్తే విదేశాల్లో వాలిపోతుంటారు. కాగా.. రామ బ్రహ్మం సుంకర నిర్మించిన భోళా శంకర్ ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీర్తీ సురేష్, సుశాంత్ కీలక పాత్రలు పోషించగా.. ఈ చిత్రానికి మహతి స్వరసాగర్ సంగీత మందించారు. వెకేషన్ నుంచి తిరిగొచ్చాక గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న చిత్రంలో నటించనున్నట్లు మెగాస్టార్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# అందుకే కొన్నాళ్లు విరామం తీసుకున్నా

## - మీరా జాస్మిన్



కెరీర్ ప్రారంభంలో అత్యధికంగా ఓ ఏడాదిలో 8 సినిమాల్లో నటించి, మెప్పించిన హీరోయిన్ మీరా జాస్మిన్ 2010 వరకు అదే స్థాయి జోరు సాగించిన ఆమె సినిమాల సంఖ్య తర్వాతర్వాత తగ్గిపోయింది. కోలీవుడ్‌కు దూరమై సుమారు 9 ఏళ్లు గడిచింది. 'టెస్ట్' తో మీరా అక్కడ రీ ఎంట్రీ ఇస్తోంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తానెందుకు నటనకు దూరంకావాల్సి వచ్చిందో తెలిపింది. "నటిగా ఇప్పటి వరకు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించా. హీరోయిన్‌గా ఆదరణ పొందడాన్ని గౌరవంగా భావిస్తున్నా. వ్యక్తిగతంగా నన్ను నేను మెరుగుపరుచుకునేందుకు కొన్నాళ్లు బ్రేక్ తీసుకున్నా. ఇటీవల కొన్ని సినిమాల్లో నటిస్తున్న సమయంలో నా జర్నీ అప్పుడే ప్రారంభమైనట్టు అనిపించింది" అని పేర్కొంది. 'టెస్ట్' గురించి మాట్లాడుతూ.. '

'మాధవన్ సిద్ధార్థ్‌లతో మరోసారి కలిసి పనిచేస్తుండడం ఆనందంగా ఉంది. నయనతారతో కలిసి తొలిసారి తెరను పంచుకోవడం గొప్ప అనుభూతి. దర్శకుడు శశికాంత్ ఈ సినిమా కథ వినిపించిన వెంటనే నటించేందుకు అంగీకరించా" అని మీరా తెలిపింది. 'రన్', 'యువ' సినిమాల్లో మాధవన్, మీరా జాస్మిన్ జోడీ ఆకట్టుకుంది. 'యువ'లో సిద్ధార్థ్ నటించిన సంగతి తెలిసిందే. ఈ హీరోయిన్ తమిళంలో నటించిన చివరి చిత్రం 2014లో వచ్చిన 'విజ్ఞాని'. 'టెస్ట్' క్రికెట్ నేపథ్యంలో సాగే సినిమా.

# విద్యార్థులు జాతి గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలి

**- క్రీడలు ఆరోగ్యంతో పాటు బంగారు భవిష్యత్తుకు పునాది**

**- రోల్ బాల్ విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన డాక్టర్ పైడి కళా వెంకట రమణమూర్తి**





మురళీనగర్ (విజయభాను న్యూస్) : విద్యార్థులు క్రీడలులో రాణిస్తూ జాతి గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి కళా వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 50వ వార్డ్ పరిధిలో ఉన్న మురళీ నగర్ వైశాకి స్పోర్ట్స్ పార్క్ లో నిర్వహించిన 3వ జిల్లా స్థాయి అండర్ 11,అండర్ 14 పురుషుల, స్త్రీల రోల్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి, వైశాకి స్పోర్ట్స్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు సనపల వరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలలో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహు మతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్య మవుతుందని, క్రీడలతో ఆరోగ్యం కూడా ఎంతో మెరుగ్గా ఉంటుందని అన్నారు. క్రీడలలో శిక్షణ పొందిన కోచ్‌ల ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా విద్యార్థులను తయారు చేయాలనీ అన్నారు. క్రీడలో మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించడానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడలు వల్ల క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, క్రీడలలో బాగా రానిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలులో స్థిరపడవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైశాకి స్పోర్ట్స్ పార్క్ అసోసియేషన్ సెక్రటరీ పొట్నూరు నాగరాజు, శాంతి భూషణ్, సురేష్ సూర్యనారాయణ, సౌత్ ఇండియా రోల్ బాల్ కోచ్ అనిల్, విశాఖపట్నం రోల్ బాల్ కోచ్ సంతోష్, వెంకట రెడ్డి (N), సుగుణ కుమార్, క్రీడాకారులు, స్థానికులు, అభిమా నులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధిలో బిజెపి నిధులే అధికం

- బీచ్ లో డబ్బులు వసూలు చేయమని కేంద్రం చెప్పలేదు
- స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ముందుకు తీసుకువెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- రాష్ట్రంలో టూరిజం పూర్తిగా నిర్వీర్యం చేశారు
- సీఐఐ సదస్సు తర్వాత రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి
- వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వి ఎన్ మాధవ్**




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర అభివృద్ధిలో బిజెపి నిధులే అధికంగా ఉన్నాయని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కేంద్రం సహాయంతో జరుగుతున్నాయని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఋషికొండ బీచ్ (బ్లూ ఫ్లాగ్ బీచ్) లో పర్యాటకుల వద్దనుండి ప్రవేశ రుసుము కేంద్రం ఆదేశాలతోనే ప్రవేశ రుసుము తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలియజేయడం హాస్యస్పదమన్నారు. బ్లూ ఫ్లాగ్ బీచ్ లలో కేంద్రం డబ్బులు వసూలు చేయమని చెప్పింది అని మంత్రి అమర్నాథ్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. బీచ్ లలో డబ్బులు వసూలు చేయమని కేంద్రం ఎక్కడ చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఋషికొండా బీచ్ లో ప్రేవేసా రుషుము వాసులు చేయాలని చుస్తే ప్రజలు నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో ఈ నెపాన్ని కేంద్ర ప్రభుత్వం పై నెట్టాలని వైకాపా పెద్దలు చూస్తున్నారని తెలియజేశారు. ఋషికొండా బీచ్ లో ప్రేవేసా రుసుము వసూలు చేయాలని అనుకోవడం దారుణం. బ్లూ ఫ్లాగ్ బీచ్ అంటే ఏంటో మంత్రి అమర్నాధ్ కు తెలుసా అని ప్రశ్నించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకువెళ్లడం లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేంద్రం పై రాష్ట్ర ప్రభుత్వం అనవసరం గా బురద జల్లుతుందని ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క టూరిజం ప్రాజెక్ట్ అయిన తెచ్చిందా, రాష్ట్రంలో టూరిజం పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రుషికొండను బొడిగుండు చేశారు. అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేస్తున్నారో ఇంతవరకు బయటకు చెప్పలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క పరిశ్రమ అయిన రాష్ట్రానికి వచ్చిందా. విశాఖ లో సి ఐ ఐ సదస్సు పెట్టారు వాటిద్వారా ఎన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి ఎంత మేరకు పెట్టుబడులు వచ్చాయి పత్రిక ముఖంగా ప్రజలకు తెలియజేయండి అని డిమాండ్ చేశారు.

మంత్రి అమర్నాధ్ చెప్పినట్లు గుడ్డు ఇంకా పొదగలేదా అని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడవలసిన అవసరం ఎంతైనా ఉంది. వైసిపి ప్రభుత్వం పెద్ద ఎత్తున విద్యుత్ బారాలను ప్రజలపై మోపుతుంది. ఎప్పుడు లేనంతగా వినియోగదారులకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# 25వ వార్డులో "జగనన్న సురక్ష"

**హాజరైన జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ**



సీతమ్మపేట, (విజయభాను న్యూస్) : జివిఎంసి మూడవ జోన్ 25వ వార్డులో సోమవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఆ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజుతో పాటు జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ హాజరయ్యారు. వార్డులోని 1086134 నంబర్ సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించగా భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై,యస్.జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ పథకాలు అందాలనే ఉద్దేశంతో "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అందులో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా లబ్ధిదారులకు అందజేయడం జరుగు తుందన్నారు. వాలంటీర్లు, గృహసారుదులు 25వ వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను ఎంపిక చేసి సుమారు 1500 మందిని ఎంపిక చేయడం జరిగిందని, ప్రస్తుతం 1250 మందికి సర్టిఫికెట్లను నేడు పంపిణీ చేస్తున్నామని మిగిలినవి రెండు, మూడు రోజుల్లో లబ్ధిదా రులకు అందిస్తా మన్నారు. అనంతరం ఉత్తర నియోజ కవర్గ సమన్వయకర్త మాట్లాడుతూ నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మో హన్ రెడ్డి పాదయాత్రలో ప్రజల కష్టాలు ఎరిగి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంక్షేమ కార్యక్రమము నూరు శాతం అమలు చేశారని పేర్కొన్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు ఎవరికైనా అందనట్లయితే సచివాలయాల్లో దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే వాలంటీర్లు, గృహ సారధులు ఇంటింటికీ వెళ్లి వివిధ పత్రాలకు సంబంధించి వివరాలు సేకరించి సర్టిఫికెట్లను అందించాలన్నారు.

ఈ కార్యక్రమం లో జెడ్సీ వై.విజయలక్ష్మి, డీపీవో చక్రవర్తి, డీటీ త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, ఏఈ శ్రీరామమూర్తి, ఏపీడీవో దుర్గా ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ద్వారా అర్హులైన

# ప్రతి ఒక్కరికి సంక్షేమం

**- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు**



కొయ్యూరు(విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం పాడేరు నియోజకవర్గం, కొయ్యూరు మండలం లో బాలారం, బకులూరు పంచాయతీలలో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమా నికి స్థానిక శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఉన్నటువంటి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం 11 రకాలైనటువంటి ప్రజా సర్వీసులు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇచ్చుటకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులై ఉండి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అందనివారికి ఈ కార్యక్రమం ఎంత గానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# కాలుష్య నియంత్రణకు సహకరించండి

**ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన నగర మేయర్**



విశాఖపట్నం,(విజయభాను న్యూస్) : విశాఖను కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలందరూ కృషి చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె విధి నిర్వహణలో భాగంగా కాలుష్య నియంత్రణనకు తమ క్యాంపు కార్యాలయం నుండి జివిఎంసి ప్రధాన కార్యాలయానికి ఏపీఎస్ఆర్టీసీ బస్సులో చేరుకొని డైల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలను ముగించుకొని ఆర్టీసీ బస్సులో తిరిగి తమ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని నగర పౌరులకు విజ్ఞప్తి చేశారు.

ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యాసంస్థల యాజమాన్యం తదితరులు కాలుష్య నియంత్రణకు సహకరించి వారంలో ఒక్క రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు ప్రతి సోమవారం తనతో పాటు జివిఎంసి ఉద్యోగులు తమ వాహనాలను వదిలి ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

# అదరగొట్టిన లక్ష్యసేన్.. - కెనడా ఓపెన్ టైటిల్ కైవసం

కాల్గరీ: భారత యువ షట్లర్ లక్ష్యసేన్ సంచలనం సృష్టించాడు. కెనడా ఓపెన్ సూపర్-500 టైటిల్‌ను కైవసం చేసుకొని ఈ టైటిల్‌ను చేజిక్కించుకున్న తొలి భారత షట్లర్‌గా రికార్డు నెలకొల్పాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్ షి ఫెంగ్(చైనా)ను చిత్తు చేసి విజేతగా నిలిచాడు. తొలి గేమ్ ఆరంభం నుంచే అద్భుతమైన ఆటతో లక్ష్యసేన్ ప్రత్యర్థిని షాక్‌కు గురి చేశాడు. వరుస సెట్లలో జోరు కొనసాగించి 21-18, 22-20తో గెలుపొందాడు. ఈ సీజన్‌లో లక్ష్యసేన్‌కు ఇదే తొలి వరల్డ్ టూర్ టైటిల్. మొత్తమ్మీద రెండో బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 టైటిల్. నిరుడు జనవరిలో లక్ష్యసేన్ ఇండియా ఓపెన్ విజేతగా నిలిచాడు. టైటిల్ గెలిచిన అనంతరం లక్ష్యసేన్ మాట్లాడుతూ.. 'ఈ ఏడాది ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని అనుకున్నా.. కానీ పరిస్థితులు కలిసి రాలేదు. కెనడా ఓపెన్ విజయం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కొన్ని మ్యాచుల్లో ఎక్కువ శ్రమ పడాల్సి వచ్చింది. పరిస్థితులు కష్టంగా ఉండేవి. అయితే.. సమయానికి తగ్గట్టు ఆడడం అనేది చాలా ముఖ్యం. కెనడా ఓపెన్‌లో అదే చేశాను' అని తెలిపాడు. లక్ష్యసేన్ ప్రస్తుతం 19వ ర్యాంక్‌లో ఉన్నాడు.

**11వ సీడ్‌కు షాక్ ఇచ్చి..**

కెనడా ఓపెన్‌లో టైటిల్ నెగ్గడమే లక్ష్యంగా బరిలోకి దిగిన లక్ష్యసేన్ అంచనాలకు మించి రాణించాడు.

సెమీఫైనల్లో 11వ సీడ్ కెంట నిషిమొటో(జపాన్)ను చిత్తు చేసి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు.

దాంతో, రెండోసారి బిడబ్ల్యూఎఫ్ సూపర్ణ్-500 టైటిల్ ఫైనల్లో అడుగుపెట్టాడు. 44 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో లక్ష్యసేన్ నిషిమొటోపై ఆధిపత్యం చెలాయించాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 21-17, 21-14తో గెలుపొందాడు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 * Phone : 2564353, Fax : 0891-2569004 * e-mail: vijayabhanudaily@gmail.com